




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11 సంచిక : 282 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ బుధవారం 18 జూన్ 2025 వెల : 5/-రూ॥
VOLUME : 11 ISSUE :282 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA WED 18 JUNE 2025 PRICE : 5/- RS
Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

## అక్టోబరు 2 నాటికి ఏపీలో ప్లాస్టిక్ రహిత నగరాలు

- రాష్ట్రంలో ప్లాస్టిక్ నిర్మూలనకు సీఎం చంద్రబాబు శ్రీకారం
- నాలుగు ప్రధాన నగరాలతో పాటు 17 కార్పొరేషన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం
- రెండు నెలల్లో సర్క్యులర్ ఎకానమీ తుది పాలసీ రూపకల్పన
- ఏడాదిలోగా మూడు ప్రాంతాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కుల ఏర్పాటు
- వ్యర్థాల నిర్వహణలో ఉత్తమ ప్రతిభకు 'స్వచ్ఛత' అవార్డులు



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా నగరాలను ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు గట్టి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది అక్టోబర్ 2వ తేదీ నాటికి విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి నగరాలతో పాటు మరో 17 కార్పొరేషన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డ సంచుల వినియోగాన్ని విరివిగా ప్రోత్సహించాలని సూచించారు.

### ప్లాస్టిక్ నిర్మూలనకు పటిష్ట చర్యలు

మంగళవారం సచివాలయంలో సర్క్యులర్ ఎకానమీపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి ఈ ఆదేశాలు జారీ చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాల సమస్యను అధిగమించేందుకు 87 పట్టణ ప్రాంతాల్లో 157 రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలని, రీసైక్లింగ్ మరియు చెత్తను వేరు చేయడంపై 90 రోజుల్లోగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని ఆదేశించారు.

### స్వచ్ఛత అవార్డులతో ప్రోత్సాహం

వ్యర్థాల నిర్వహణలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి ప్రోత్సాహకంగా వచ్చే ఏడాది అక్టోబర్ 2 నుంచి 'స్వచ్ఛత' అవార్డులను అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. స్థానిక సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీలు, పాఠశాలలు-కళాశాలలు, బస్టాండ్లు, ఆసుపత్రులు, ఎన్జీవోలు, వివిధ సంస్థల వారీగా ఈ అవార్డులను అందజేయాలని నిర్దేశించారు.

### సర్క్యులర్ ఎకానమీకి పెద్దపీట

రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేసేందుకు, వ్యర్థాల నుంచి సంపద సృష్టించే లక్ష్యంతో రెండు నెలల్లోగా సర్క్యులర్ ఎకానమీకి సంబంధించిన తుది పాలసీని తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా, ఏడాదిలోగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. మొదటి దశలో విశాఖపట్నంలో 400 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న పార్కును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని, ఇందుకుగాను వివిధ దేశాల్లోని విజయవంతమైన పార్కులను అధ్యయనం చేయాలని సూచించారు. ఈ పార్కుల ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు ఆకర్షించేలా వివరాలు 2లో..

## ఆరోగ్య శాఖపై రూ.6,500 కోట్ల అప్పులు మిగిల్చారు

- గత ఐదేళ్ల జగన్ పాలనలో ఆరోగ్య వ్యవస్థ భ్రష్టుపట్టిందన్న సత్యకుమార్
- ఆరోగ్యశ్రీకి రూ.2,500 కోట్లు, మందులకు రూ.1000 కోట్ల బకాయిలున్నాయని వెల్లడి
- ఏడాదిలో మౌలిక వసతులు, సిబ్బంది నియామకంతో మార్పు తెచ్చామన్న మంత్రి



పెన్ పవర్ డెస్క్:గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలోని ఇతర వ్యవస్థలతో పాటు ఆరోగ్య వ్యవస్థను కూడా పూర్తిగా నిర్వీర్యం చేసి భ్రష్టు పట్టించారని ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించారని, అందుకే ఎన్నికల్లో తగిన తీర్పు ఇచ్చారని ఆయన వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం దివాళా తీసిన ఆర్థిక వ్యవస్థను వివరాలు 2లో..

## తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ అంశంలో మరో మలుపు... షర్మిల ఫోన్ ట్యాప్!



- వైసీపీ హయాంలో షర్మిల ఫోన్లు ట్యాప్ అయినట్లు గుర్తింపు
- కోడ్ భాష వాడి సంభాషణలు రికార్డ్ చేశారని ఆరోపణ
- వివరాలు ఎప్పటికప్పుడు జగన్‌కు చేరవేశారని సమాచారం వివరాలు 2లో..

## ఇరాన్ సుప్రీం లీడర్ ఖొమైనీని చంపడమే యుద్ధానికి సరైన ముగింపు

- ఖొమైనీని చంపితే యుద్ధం ముగుస్తుందన్న నెతన్యాహు
- ఈ చర్యతో పరిస్థితి తీవ్రతరం కాదని వ్యాఖ్య
- ఇరాన్ తమను అణుయుద్ధం అంచుకు తీసుకొస్తోందన్న నెతన్యాహు

వివరాలు 2లో..



## బెంగళూరు విమానాశ్రయంలో చెవిరెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



- లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న చెవిరెడ్డి
- చెవిరెడ్డిపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ
- చెవిరెడ్డిని విజయవాడ సిట్ కార్యాలయానికి తరలించే అవకాశం

పెన్ పవర్ డెస్క్:వైసీపీ సీనియర్ నేత, మాజీ శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని బెంగళూరు విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనపై మద్యం కేసుకు సంబంధించి వివరాలు 2లో..

## ఇండియా కూటమి చెక్కుచెదరదు, వెళ్లేవాళ్లు వెళ్లొచ్చు



- ఇండియా కూటమి పటిష్టంగా ఉందన్న అఖిలేశ్
- కూటమిలో ఉంటూ బలహీనపరిచే మాటలు వద్దని హితవు
- యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి సత్తా చాటుతుందని ధీమా

పెన్ పవర్ డెస్క్: ప్రతిపక్ష ఇండియా కూటమిలో ఐక్యత లేదని, కూటమి పని అయిపోయిందంటూ వస్తున్న ఊహాగానాలపై ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఘాటుగా స్పందించారు. ఇండియా కూటమి చాలా బలంగా ఉందని, చెక్కుచెదరకుండా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కూటమి నుంచి ఎవరైనా బయటకు వెళ్లాలనుకుంటే స్వేచ్ఛగా వెళ్లిపోవచ్చని, వారిని ఎవరూ ఆపబోరని అన్నారు. అయితే, కూటమిలో కొనసాగుతూ దాన్ని వివరాలు 2లో.. బలహీనపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని

## సమస్యలపై అడిగితే 'మావోయిస్టు' అంటున్నారు

- హైదరాబాద్ ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహణ
- ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్
- కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ఆర్. నారాయణమూర్తి ఆగ్రహం



పెన్ పవర్ డెస్క్: ప్రశ్నించే వారిని నక్సలైట్లుగా ముద్ర వేయడం సరికాదని, సమస్యలపై గళమెత్తేవారిని 'అన్నలు' అంటూ నిందిస్తున్నారని, తప్పులు చేసినా మౌనంగా ఉండేవారిని ఏమీ అనడం లేదని ప్రముఖ సినీ నటుడు ఆర్. నారాయణమూర్తి అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి, మావోయిస్టు సంఘాల నేతలతో చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'ను వివరాలు 2లో..

## గుడిలో దోపిడీ జరిగినా పట్టించుకోనంత బిజీగా ఉన్నారా పవన్ కల్యాణ్ గారూ!

- ముక్తేశ్వరం ఆలయంలో పట్టపగలు దోపిడీ.
- పవన్ ను టార్గెట్ చేసిన యాంకర్ శ్యామల
- సనాతని పవన్ పట్టించుకోరా అంటూ వ్యాఖ్యలు



పెన్ పవర్ డెస్క్:అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఓ ప్రసిద్ధ ఆలయంలో పట్టపగలే దొంగలు చొరబడి లక్షల విలువైన ఆభరణాలను అపహరించుకుపోయిన ఘటన ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుంది. ఈ ఉదంతంపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాంకర్ శ్యామల... ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోని గుడిలో పట్టపగలు బంగారం దోపిడీ జరిగినా పట్టించుకోలేనంత బిజీగా ఉన్నారా 'ది సో కాల్డ్ సనాతని' పవన్ కల్యాణ్ గారూ?" అంటూ వ్యంగ్యంగా ప్రశ్నించారు. వివరాలు 2లో..

## ఇజ్రాయెల్ 'మొసాద్' కేంద్ర కార్యాలయంపై ఇరాన్ బాంబుల మోత!

- ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ముదురుతున్న ఘర్షణ
- ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్ ప్రధాన కార్యాలయంపై ఇరాన్ బాంబు దాడి
- గ్లిలాట్‌లోని ఇజ్రాయెల్ సైనిక ఇంటెలిజెన్స్ కాంప్లెక్స్‌పైనా క్షిపణి ప్రయోగం
- మధ్యవర్తుల ద్వారా చర్చలకు సిద్ధమంటూనే దాడులు కొనసాగిస్తున్న ఇరాన్
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కెనడా పర్యటన అర్ధాంతరంగా ముగింపు

పెన్ పవర్ డెస్క్:ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఇజ్రాయెల్ అణుకేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తుండగా, ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌లోని కీలక ప్రాంతాలపై క్షిపణులతో విరుచుకుపడుతోంది. ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్ కేంద్ర కార్యాలయంపై ఇరాన్ బాంబులతో దాడి చేసినట్లు ఇరాన్ మీడియా వర్గాలు వెల్లడించాయి. అత్యంత కచ్చితత్వంతో ఈ దాడి జరిగిందని సదరు మీడియా పేర్కొంది. అంతేకాకుండా, గ్లిలాట్‌లోని ఇజ్రాయెల్ మిలటరీ ఇంటెలిజెన్స్ కాంప్లెక్స్‌ను వివరాలు 2లో..



## కులగణన కోసం రోడ్డెక్కుతాం



పెన్ పవర్ డెస్క్:కులగణన చేపట్టాలనే డిమాండ్‌తో అవసరమైతే రోడ్డెక్కి యుద్ధం చేయడానికి కూడా సిద్ధమని తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు సంచలన ప్రకటన చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కేవలం జనగణన గురించి మాట్లాడుతోందని, కులగణన ప్రస్తావన తీసుకురావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ, "కేంద్రం చేపడుతున్న జనగణన వల్ల బీజేపీకి తప్ప మరెవరికీ ప్రయోజనం ఉండదు. ముఖ్యంగా వివరాలు 2లో..

- కులగణన కోసం పోరాటం తప్పదన్న వీహెచ్
- కేంద్రం జనగణన అంటోంది, కులగణనను పట్టించుకోవట్లేదని విమర్శ
- జనగణన వల్ల బీజేపీకే లాభం, బీసీలకు ఉపయోగం లేదన్న హనుమంతరావు
- దేశంలో 16 ఏళ్ల తర్వాత జనగణనకు కేంద్రం నోటిఫికేషన్ విడుదల

## జగన్ సత్తెనపల్లి పర్యటనపై ఘాటుగా స్పందించిన కన్నా లక్ష్మీనారాయణ

- జగన్‌ను నమ్మితే మిగిలేది సర్వనాశనమేనన్న కన్నా
- ఆత్మహత్య చేసుకున్న నేత విగ్రహానికి జగన్ ఆవిష్కరణా? సిగ్గుచేటు అంటూ ఫైర్
- జగన్ పర్యటనకు ఒక్కరోజు ముందు టీడీపీలో చేరిన సత్తెనపల్లి కౌన్సిలర్లు



వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ఫ్యాన్ గిర్రున

వైసీపీ అధినేత జగన్ ఎక్కడకు పర్యటనకు వెళ్లినా విపరీతంగా జనం వస్తున్నారు. వాళ్లు కార్యకర్తలు కావచ్చు. అభిమానులు కావచ్చు. కూటమి ప్రభుత్వంపై విసుగు చెందని వారు కావచ్చు. ఎవరైనా సరే జగన్ పర్యటనలో జనం మాత్రం విపరీతంగా వస్తుండటంతో పార్టీ నేతల్లో ఉత్సాహం పెరుగుతుంది. జగన్ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత జరిపిన పర్యటనలన్నీ విజయవంతమయ్యాయి. ప్రాంతాలకు అతీతంగా సక్సెస్ కావడంతో వైసీపీ నేతల్లో తిరిగి ఉత్సాహం ఉరకలేస్తుంది. జగన్ ఏడాది కాలం నుంచి రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర లోని అనేక ప్రాంతాల్లో పర్యటించారు. తిరుపతి, కడప, అనంతపురం, కర్నూలు రాయలసీమలోనూ, విశాఖ, శ్రీకాకుళం ఉత్తరాంధ్రలోనూ, తెనాలి, పొదిలి కోస్తాంధ్ర జిల్లాల్లో పర్యటించారు.

**జనం పోటెత్తుతుండటంతో...**

ఇప్పటి వరకూ జగన్ పర్యటించిన అన్ని ప్రాంతాలకు జనం పోటెత్తారు. జనసమీకరణ చేయడానికి పార్టీ ప్రతిపక్షంలో ఉంది. వచ్చే ఎన్నికలలో పోటీ చేయాలనుకునే వారు చేసే బలప్రదర్శన కాదు. చాలా వరకూ జగన్ కోసం వచ్చినవారేనని వైసీపీ నేతలు చెబుతున్నారు. వాహనాలను సమకూర్చకుండానే, ఎలాంటి సదుపాయాలు కల్పించకుండానే జనం తరలి రావడం చూసి నేతల్లో ఒకరమైన విజయదరహాసం కనపడుతుంది. ప్రజల్లో వచ్చిన మార్పునకు సంకేతమని సీనియర్ వైసీపీ నేత ఒకరు వ్యాఖ్యానించారు. జగన్ వస్తున్నారని తెలిసి తాము ఆహ్వానించకుండానే పత్రికలు, టీవీల్లో వార్తలు చూసి వచ్చిన వారే ఎక్కువగా కనిపిస్తున్నారని ఆయన అనడం తాము విజయానికి చేరువలో ఉన్నామని చెప్పకనే చెప్పారు.

**పార్టీని వీడదామనుకున్న వారు...**

వైసీపీ అధినేత జగన్ పర్యటనకు స్పందన మామూలుగా లేకపోవడంతో ఇక నేతలు కూడా పార్టీని వీడే ఆలోచన మానుకున్నట్లే కనపడుతుంది. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైసీపీదే అధికారం అని మానసికంగా వైసీపీ నేతలు సిద్ధమయ్యారు. ప్రధానంగా గుంటూరు జిల్లాలో ఉన్న తెనాలిలోనూ జనం అంత మేర వచ్చారంటే ఇక చెప్పాల్సిన పనిలేదంటున్నారు. ఇక పొదిలిలో పొగాకు రైతుల పరామర్శకు వెళ్లినప్పుడు జగన్ హెలికాప్టర్ దిగిన దగ్గర నుంచి యువకులు, మహిళలు, రైతులు ఇలా అన్ని వర్గాల ప్రజలు హాజరవ్వడంతో ఇక తమకు తిరుగులేదన్న అభిప్రాయంలోకి జగన్ పార్టీ నేతలు వచ్చారు. ఇక ఎప్పుడు ఎన్నికలు జరిగినా తమదే విజయం అన్న ధీమా ఫ్యాన్ పార్టీ నేతల్లో పెరిగింది.

**నాడు చంద్రబాబు సభలకూ...**

2024 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అనేక కార్యక్రమాలు పెట్టారు. అనేక నినాదాలతో కార్యక్రమాలను పెట్టి జనం ముందుకు వెళ్లారు. ఒంగోలు నాడు పెట్టిన మహానాడు సూపర్ సక్సెస్ అయింది. అప్పుడే టీడీపీ విజయం ఖాయమయిందని క్యాడర్ లో విశ్వాసం కనిపించింది. కందుకూరు, గుంటూరు వంటి సభల్లో తొక్కిసలాట జరిగి మరణించినా ఎవరూ వెనక్కు తగ్గలేదు. అదే విశ్వాసం ఇప్పుడు వైసీపీ క్యాడర్ లోనూ కనిపిస్తుంది. వైసీపీ సోషల్ మీడియా కూడా రెండు మూడు నెలల కంటే ముందు ఇప్పుడు యాక్టివ్ గా మారింది. జనం రాక చూసిన వైసీపీ నేతలు తమను అరెస్ట్ చేసుకోండి అని సవాళ్లు విసరడం కూడా అధికారంలోకి రావడం గ్యారంటీ అని భావించడం వల్లనేనని అంటున్నారు. మొత్తం మీద ఎన్నికలకు నాలుగేళ్ల ముందే వైసీపీ లో మంచి జోష్ కనిపిస్తుండటం ఆ పార్టీ నేతలను యాక్టివ్ చేసిందనే చెప్పాలి.

# అక్టోబరు 2 నాటికి ఏపీలో ప్లాస్టిక్ రహిత నగరాలు

- మొదటి పేజీ తరువాయి

చూడాలన్నారు. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లలో ఆధునిక యంత్రాల వినియోగాన్ని పెంచాలని కూడా ఆయన దిశానిర్దేశం చేశారు. 'మెటీరియల్ రీసైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' సమర్పించిన 'సర్క్యులర్ ఎకానమీ పార్కుల' ఏర్పాటు ప్రతిపాదనలను కూడా సీఎం పరిశీలించారు.

**11 కీలక రంగాలు, 3 శాఖలపై ప్రత్యేక దృష్టి**

సర్క్యులర్ ఎకానమీ కింద కేంద్ర ప్రభుత్వం గుర్తించిన మున్సిపల్, వాహనాలు, లిథియం బ్యాటరీలు, జిప్సం, టైర్లు, రబ్బర్, ఎలక్ట్రానిక్, వ్యవసాయం, పారిశ్రామిక, ఆక్వా వ్యర్థాలు వంటి 11 రంగాలపై ప్రధానంగా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. వీటికి అదనంగా గనులు, చేనేత, పశుసంవర్ధక శాఖలను కూడా కలుపుకుని సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. నగర పాలక సంస్థలు, పంచాయతీల్లో జీరో వేస్ట్ లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు.

## ఆరోగ్య శాఖపై రూ.6,500 కోట్ల
# అప్పులు మిగిల్చారు

- మొదటి పేజీ తరువాయి

వారసత్వంగా ఇవ్వడమే కాకుండా, ఆరోగ్య రంగంపై కూడా సుమారు రూ.6,500 కోట్ల మేర అప్పుల భారాన్ని మోపిందని ఆరోపించారు.గత ప్రభుత్వం మిగిల్చిన అప్పుల గురించి మంత్రి సత్యకుమార్ వివరిస్తూ, "ఆరోగ్యశ్రీ పథకం కింద చెల్లించాల్సిన బకాయిలు రూ.2,500 కోట్లు, మందుల సరఫరా సంస్థలకు ఇవ్వాల్సినవి రూ.1,000 కోట్లు ఉన్నాయి. వీటితో పాటు వైద్య కళాశాలల నిర్మాణ పనులకు సంబంధించి రూ.700 కోట్లు, నాడు-నేడు కార్యక్రమం కింద మరో రూ.400 కోట్ల అప్పులు కూడా మిగిల్చి వెళ్లారు" అని తెలిపారు. ఇన్ని అప్పులతో ఆరోగ్య వ్యవస్థను గందరగోళంలో పడేశారని ఆయన మండిపడ్డారు.

అయితే, తాము అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే వైద్య ఆరోగ్య రంగంలో గణనీయమైన మార్పులు తీసుకువచ్చామని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. "మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, అవసరమైన మానవ వనరుల సిబ్బంది నియామకం చేపట్టడం ద్వారా ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణను బలోపేతం చేశాం. ముఖ్యంగా, జాతీయ ఆరోగ్య మిషన్ (నేషనల్ హెల్త్ మిషన్) కింద రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 రకాల పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయి" అని ఆయన వివరించారు. వివిధ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమాల పనితీరును మెచ్చిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రోత్సాహకంగా రూ.100 కోట్లను విడుదల చేసిందని ఆయన వెల్లడించారు. "కేవలం ఏడాది కాలంలోనే ఆరోగ్య శాఖలో ఇంతటి సానుకూల మార్పును తీసుకురాగలిగాం. శాఖను పూర్తిగా గాడిన పెట్టేందుకు, ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది" అని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు.

# జగన్ సత్తెనపల్లి పర్యటనపై ఘాటుగా స్పందించిన కన్నా లక్ష్మీనారాయణ

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ రేపు పల్నాడు జిల్లా సత్తెనపల్లి పర్యటనకు వస్తున్నారు. గతేడాది ఆత్మహత్య చేసుకున్న వైసీపీ నాయకుడు నాగమల్లేశ్వరరావు విగ్రహావిష్కరణ చేయనున్నారు. ఈ పర్యటన రాజకీయంగా తీవ్ర ఉత్కంఠ కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో, జగన్ పర్యటనపై సత్తెనపల్లి టీడీపీ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఘాటుగా స్పందించారు.

జగన్ ను నమ్మి ఆయన కుటుంబ సభ్యులతో పాటు ఎంతో మంది సర్వనాశనమయ్యారని తీవ్రస్థాయిలో విమర్శించారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి మున్సిపాలిటీకి చెందిన నలుగురు వైసీపీ కౌన్సిలర్లు నేడు టీడీపీలో చేరారు. జగన్ పల్నాడు జిల్లా పర్యటనకు కేవలం ఒక రోజు ముందు వైసీపీకి చెందిన కౌన్సిలర్లు పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరడం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కన్నా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

"జగన్ ఇచ్చిన తప్పుడు సర్వే రిపోర్టుల కారణంగానే నాగమల్లేశ్వరరావు ఎన్నికల బెట్టింగ్‌లో ఏకంగా రూ.10 కోట్లు నష్టపోయారు. అప్పులు ఇచ్చిన వారి నుంచి తీవ్ర అవమానాలు ఎదురవడంతో, తట్టుకోలేక ఆయన 2024 జూన్ 9వ తేదీన ఆత్మహత్య చేసుకున్నారు.

అలాంటి వ్యక్తి విగ్రహాన్ని ఆవిష్కరించడానికి ఇప్పుడు జగన్ రావడం సిగ్గుచేటు" అని కన్నా మండిపడ్డారు.జగన్ అరాచకాలను ప్రజలు భరించలేకపోయారని, అందుకే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆయన పార్టీని చిత్తుచిత్తుగా ఓడించారని కన్నా గుర్తుచేశారు. "ఇలాంటి అరాచక శక్తులను పరామర్శించడానికి వస్తే, ఈసారి ఆ పార్టీకి 11 సీట్లు కూడా దక్కవు" అని ఆయన హెచ్చరించారు.

# ఇరాన్ సుప్రీం లీడర్ ఖొమైనీని చంపడమే యుద్ధానికి సరైన ముగింపు

ఇరాన్‌తో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖొమైనీని అంతమొందించడమే ఈ సంఘర్షణకు అత్యంత ప్రభావవంతమైన ముగింపు అని ఆయన అన్నారు. ఖొమైనీని లక్ష్యంగా చేసుకునే ఇజ్రాయెల్ ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వీటో చేశారని అమెరికా అధికారులు ధృవీకరించిన మరుసటి రోజే నెతన్యాహు ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య క్షిపణి దాడులు నాలుగో రోజుకు చేరాయి. ఇరు దేశాలు పౌర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నాయి.ఖొమైనీని హతమార్చడం వల్ల వివాదం ముగిసిపోతుందని, మరింత తీవ్రతరం కాదని గట్టిగా విశ్వసిస్తున్నట్లు నెతన్యాహు తెలిపారు. ఇరాన్ దుందుడుకు చర్యలను నిరోధించడానికి, దుష్ట శక్తులను ఎదుర్కోవడానికే ఇజ్రాయెల్ ఈ చర్యలు తీసుకుంటోందని ఆయన నొక్కిచెప్పారు.అమెరికాకు చెందిన ఏబీసీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో, ఖొమైనీని చంపేందుకు ఇజ్రాయెల్ వేసిన ప్రణాళికను ట్రంప్ వీటో చేశారన్న వార్తలపై నెతన్యాహు స్పందించారు. "ఇది సంఘర్షణను పెంచదు, ముగిస్తుంది" అని ఆయన అన్నారు. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఘర్షణ మరింత తీవ్రమవుతుందన్న ఆందోళనతో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని కథనాలు వస్తున్నాయి."ఇరాన్ కోరుకునేది 'శాశ్వత యుద్ధం', వారు

మమ్మల్ని అణుయుద్ధం అంచుకు తీసుకువస్తున్నారు" అని నెతన్యాహు పేర్కొన్నారు. "వాస్తవానికి, ఇజ్రాయెల్ చేస్తున్నది దీనిని నివారించడమే. ఈ దురాక్రమణకు ముగింపు పలకడమే. దుష్ట శక్తులను ఎదుర్కోవడం ద్వారానే మనం ఇది చేయగలం" అని ఆయన వ్యాఖ్యానించారు.

## ఇజ్రాయెల్ 'మొసాద్' కేంద్ర కార్యాలయంపై ఇరాన్ బాంబుల మోత!

- మొదటి పేజీ తరువాయి

కూడా క్షిపణితో లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. ఇజ్రాయెల్ దాడుల వెనుక మొసాద్ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని ఇరాన్ ఆరోపిస్తోంది. ఇరాన్‌లోని అణు స్థావరాల వివరాలు, కీలక శాస్త్రవేత్తలు, అధికారుల నివాసాల సమాచారాన్ని మొసాద్ ఇజ్రాయెల్‌కు చేరవేసిందని చెబుతున్నారు. ఇరాన్‌లోకి భారీగా డ్రోన్లను తరలించి ఇజ్రాయెల్ చేపట్టిన కోవర్ట్ ఆపరేషన్ వెనుక కూడా మొసాద్ హస్తం ఉందని ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే మొసాద్ ప్రధాన కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ఈ దాడికి పాల్పడింది. రాత్రి సమయాల్లోనే ఇరాన్ ఈ క్షిపణి దాడులు నిర్వహిస్తోంది. ఒకవైపు దాడులు కొనసాగిస్తూనే, మరోవైపు చర్చలకు సిద్ధంగా ఉన్నామంటూ ఇరాన్ మధ్యవర్తుల ద్వారా ఇజ్రాయెల్,

అమెరికాలకు సంకేతాలు పంపుతోంది. అయితే, దాడులను మాత్రం ఆపడం లేదు. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఈ యుద్ధ వాతావరణంపై ప్రపంచ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిణామాలు ఎక్కడికి దారితీస్తాయోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# కులగణన కోసం రోడ్డెక్కుతాం

- మొదటి పేజీ తరువాయి

బడుగు, బలహీన వర్గాలైన బీసీలకు దీనివల్ల ఒరిగేది ఏమీ లేదు" అని అన్నారు. కులగణన ఆవశ్యకతను అన్ని రాజకీయ పార్టీలు గుర్తించి, దానికోసం గళం విప్పాలని ఆయన కోరారు.మరోవైపు, దేశంలో దాదాపు 16 సంవత్సరాల విరామం తర్వాత జరగనున్న జనగణనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ జనగణన ప్రక్రియ రెండు దశల్లో జరగనుంది. దేశ చరిత్రలో ఇది 16వ జనగణన కాగా, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చేపడుతున్న 8వది కావడం గమనార్హం.

జనగణన తొలి దశలో భాగంగా హిమాలయ ప్రాంతాలైన జమ్ముకశ్మీర్, లడక్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలో 2026 అక్టోబర్ 1వ తేదీ వరకు జనగణన పూర్తి చేయనున్నారు. రెండో దశలో, 2027 మార్చి 1వ తేదీ నాటికి దేశంలోని మిగిలిన అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జనగణన పూర్తి చేయనున్నట్లు కేంద్ర హోం శాఖ స్పష్టం చేసింది. అయితే, ఈ జనగణనలో కులాల వారీగా వివరాలు సేకరిస్తారా లేదా అనే అంశంపై స్పష్టత లేకపోవడంతో వీహెచ్ వంటి నేతలు కులగణన కోసం పట్టుబడుతున్నారు.

## తెలంగాణలో ఫోన్ ట్యాంపింగ్ అంశంలో మరో మలుపు... షర్మిల ఫోన్ ట్యాప్!

తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్‌కు గురైనట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇప్పటికే గుర్తించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేరు కూడా చేరినట్లు తెలుస్తోంది. ఏపీలో వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో షర్మిల మొబైల్ ఫోన్లను అత్యంత రహస్యంగా ట్యాప్ చేసినట్లు సమాచారం. ఇందుకోసం ప్రత్యేకంగా కోడ్ భాషను కూడా ఉపయోగించినట్లు తెలుస్తోంది. షర్మిల వాయిస్ సంభాషణలను రికార్డు చేయడమే కాకుండా, ఆమె ఎవరెవరితో మాట్లాడుతున్నారనే వివరాలను ఎప్పటికప్పుడు ఆమె సోదరుడి (జగన్)కి చేరవేసినట్లు ఆరోపణలున్నాయి. షర్మిల ఎవరితో సంప్రదింపులు జరుపుతున్నారనే దానిపై నిశితంగా నిఘా పెట్టినట్లు కూడా వార్తలు వస్తున్నాయి. అంతేకాకుండా, షర్మిలకు సన్నిహితంగా ఉండే కొందరిని ఓ సీనియర్ పోలీస్ అధికారి పిలిపించి హెచ్చరించినట్లు కూడా గుర్తించారు.తన ఫోన్లు ట్యాప్ అవుతున్నాయన్న విషయాన్ని షర్మిల అప్పట్లోనే పసిగట్టినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఆమె వద్ద కీలక ఆధారాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అంశానికి సంబంధించి పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

## గుడిలో దోపిడీ జరిగినా పట్టించుకోనంత బిజీగా ఉన్నారా పవన్ కల్యాణ్ గారూ!

- మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు దోపిడీ వార్త క్లిప్పింగ్ ను కూడా శ్యామల సోషల్ మీడియాలో పంచుకున్నారు.వివరాల్లోకి వెళితే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం ముక్తేశ్వరంలో కొలువైన శ్రీముక్తికాంత క్షణముక్తేశ్వరాలయంలో శుక్రవారం (జూన్ 13) మధ్యాహ్నం ఈ చోరీ జరిగింది. ఆలయం మూసివేసిన సమయంలో గుర్తుతెలియని దుండగులు తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. గర్భగుడిలోని అమ్మవారి మెడలోని బంగారు, వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. వీటి విలువ సుమారు లక్షా నలభై వేల రూపాయలు ఉంటుందని ఆలయ వర్గాలు మరియు స్థానికులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. ఆలయ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీమ్ ఇన్‌ఛార్జ్ కె. ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలోని బృందం ఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలతో పాటు ఇతర కీలక ఆధారాలను సేకరించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తును ముమ్మరం చేశారు. సమీపంలోని సీసీటీవీ ఫుటేజ్‌లను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

## ఇండియా కూటమి చెక్కుచెదరదు, వెళ్లేవాళ్లు వెళ్లొచ్చు

- మొదటి పేజీ తరువాయి

ఆయన హితవు పలికారు.ఈ మధ్యాహ్నం లక్నోలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 2027లో జరగనున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి కచ్చితంగా తన సత్తా చాటుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కూటమిలోని పార్టీల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, అందరూ కలిసికట్టుగా ఉన్నారని తెలిపారు.ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై అఖిలేశ్ యాదవ్ తీవ్ర విమర్శలు చేశారు. మహాకుంభమేళాలో మరణించిన వారి కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల చొప్పున పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, అయితే ఇప్పటివరకు మృతుల పేర్లను ఎందుకు వెల్లడించడం లేదని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఏముందని ఆయన నిలదీశారు. ప్రభుత్వ ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న దానికి పొంతన లేదని ఆరోపించారు.

### బెంగళూరు విమానాశ్రయంలో
## చెవిరెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

- మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి వస్తున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. విమానాశ్రయం వద్ద ఆయను అడ్డుకుని, అదుపులోకి తీసుకున్నారు. ఆయనను తదుపరి విచారణ నిమిత్తం విజయవాడలోని సిట్ కార్యాలయానికి తరలించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## సమస్యలపై అడిగితే 'మావోయిస్టు' అంటున్నారు

- మొదటి పేజీ తరువాయి

నిలిపివేసి మావోయిస్టులతో శాంతియుత చర్చలు ప్రారంభించాలని కోరుతూ కమ్యూనిస్ట్ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నాడు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా చౌక్‌లో మహాధర్నా జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో పలువురు నాయకులు, హక్కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ నిరసనలో తెలంగాణ జనసమితి అధినేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, "ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారు. అడవుల నుంచి వారిని తరిమివేసి, విలువైన అటవీ వనరులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ ఆపరేషన్ చేపట్టింది" అని ఆరోపించారు. ఆదివాసీల హక్కులను కాలరాస్తూ, వారి జీవనాధారాన్ని దెబ్బతీసే ఇలాంటి చర్యలను తక్షణమే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు.

# తాడేపల్లిగూడెంలో ఎయిర్పోర్ట్ మంజూరు



**తాడేపల్లిగూడెం,పెన్ పవర్, జూన్ 17:** తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు అనుమతి లభించిందని స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రకటించారు. స్థానిక గమిని ఫంక్షన్ హాల్లో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి ఈతకోట తాతాజీ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా ప్రధాని నరేంద్ర మోడీ దేశం కోసం చేసిన సేవలు, రాష్ట్రాల అభివృద్ధికి ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ లో సంక్షేమ పథకాల అమలు మంజూరు కు ఇచ్చిన నిధులు గురించి వివరించారు. బిజెపి నాయకులు శరణాల మాలతీ రాణి, నరిశే సోమేశ్వరరావు, కోట రాంబాబు, గట్టెం మాణిక్యాలరావు, టిడిపి నాయకులు కిలపర్తి వెంకటరావు, జనసేన నాయకులు వర్తనపల్లి కాశి మాట్లాడారు. ప్రధాని మోదీ చేసిన అభివృద్ధి పనులను దేశ విదేశాల్లో భారతదేశ కీర్తి ప్రతిష్టలను వివరించి న విధానాన్ని పలువురు అభినందనలు తెలిపారు. తొలుత రామ గాని సత్యనారాయణ స్వాగతం ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ | డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ | తూ॥ గోదావరి | ప॥ గోదావరి | ఏలూరు

## డి ఏ జూగా ద్వారా
# మౌలిక సదుపాయాల కల్పన



**గంగవరం, పెన్ పవర్ జూన్17 :** ఏజెన్సీలోని గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ధర్తీ అభజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ ద్వారా గిరిజనులకు అవగాహన కల్పించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ఎపీఓ జనరల్ డిఎన్వి రమణ పేర్కొన్నారు. మంగళవారం గంగవరం మండలం దొరమామిడి గ్రామంలో డిఏ జుగా పథకం సమావేశంలో రంపచోడవరం ఐటీడీఏ ఎపిఓ జనరల్ డి ఎన్ వి రమణ మాట్లాడుతూ ఏజెన్సీలోని ధర్తీ అభ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (డిఏ జూగా) పథకం అమలు చేయడానికి ఏజెన్సీలో 211 గ్రామాలు ముందుగా గుర్తించడం జరిగిందని ఈ గుర్తించిన గ్రామాలలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో, సిబ్బందితో కమిటీలు వేయడం జరిగిందని అదేవిధంగా ఈ కమిటీలు గుర్తించిన గ్రామాలలో వివిధ గిరిజన తెగలకు అవగాహన సదస్సుల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈనెల 15వ తారీకు నుండి ఈనెల 30వ తారీకు వరకు డీఏ జూగా ద్వారా అవగాహన సదస్సులలో అర్హులైన లబ్ధిదారులకు ఆధార్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, పీఎం ఆవాస్ యోజన పథకంలో పక్కా గృహాలు, పాఠశాలల నిర్మాణాలు, ఏకలవ్య మోడల్ పాఠశాలల నిర్మాణాలు, వైద్య ఆరోగ్య సేవలు అందించే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రధానమంత్రి జన్మన్ పథకం కింద ఆర్థిక చేకూర్పు కల్పించాలని అదేవిధంగా గ్యాస్ కనెక్షన్లు లేని లబ్ధిదారులను గుర్తించి పీఎం ఉజ్వల్ పథకంలో గ్యాస్ కనెక్షన్లు అందించాలన్నారు. ప్రతి కుటుంబానికి బ్యాంక్ అకౌంట్ ప్రారంభించాలన్నారు. డి ఎ జూగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న గ్రామాలలో ఉన్న అంతరగత రహదారులు, విద్యుత్ సదుపాయాలు, త్రాగునీటి సౌకర్యాలు, పాఠశాలలు ఉన్నది లేనిది తెలుసుకొని మౌలిక సదుపాయాలు కల్పించి గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయాలని సూచించారు. నిరుద్యోగ గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ అందించాలన్నారు. దర్తి అభ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ను సమర్థవంతముగా అమలు చేయటానికి మండల స్థాయి, గ్రామస్థాయి లో కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. గ్రామసభలు నిర్వహిస్తున్న గ్రామాలలో ముందు రోజు దండోరా వేయించాలన్నారు. అదేవిధంగా స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని అన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సమ నవ్వయంతో పనిచేసి దర్తి అభ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (డిఏ జుగాను) విజయవంతముగా నిర్వహించి గిరిజన ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణరావు, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి,సర్పంచ్ పంద చంద్రకళ, ఎంపీటీసీ పండ ఆది నారాయణ,ఉపాధి హామీ పథకం ఏపీవో ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## వైఆర్సి భూముల్లో
# అక్రమ మట్టి తవ్వకాలు

### నాయకుల అక్రమ సంపాదనకు అడ్డగా ప్రాజెక్ట్ ఏరియా





**ఏలేశ్వరం, పెన్ పవర్, జూన్ 17:** స్థానిక వై ఆర్ సి భూముల్లో అక్రమ మట్టి త్రవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఏలేరు రిజర్వాయర్ కు ఆనుకుని సర్వేనబర్ 54 నల్ల కంకర క్వారీలు నిర్వహింపబడేవి. అయితే క్వారీ లో నిర్వహింపబడే భారీ బ్లాస్టింగ్ ల వల్ల ప్రాజెక్ట్ కు ముప్పు వాటిల్లుతుందని పూణే కమిటీ ఇచ్చిన సిఫారసుల మేరకు త్రవ్వబడిన క్వారీల స్థానే 50 మీటర్ల ఎత్తున మట్టి నింపాలని నిపుణుల కమిటీ సూచించింది. దీంతో గోతులు పడిన క్వారీల లో మట్టి పోసి , ఆ ప్రాంతం నో మాన్ జోన్ గా ప్రకటించారు. అప్పటినుంచి 54 సర్వే నెంబర్ క్వారీల్లో మూతపడంతోపాటు, ఆ ప్రాంతం ఏలేరు ప్రాజెక్టు అధికారుల అధీనంలోకి తేబడింది. అయితే ఇటీవల ఏలేరు రిజర్వాయర్ నిర్వహణకు సిబ్బంది లేకపోవడంతో కొంతమంది అక్రమార్జనపరుల దృష్టి ప్రాజెక్టు సేఫ్టీ కోసం ఉంచిన మట్టి నిల్వలపై పడింది. దీంతో నాయకుల అడ్డదండలతో రేయింబవళ్లు అదును చూసి అక్రమట్టుగా తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఎవరు ఎన్ని ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడానికి వీలు లేకుండా రాజకీయ నాయకులు మోకాలు అడ్డుతున్నారు. రాజకీయపెత్తనం మితిమీరడంతో అధికారులు చూసి చూడనట్టు ఊరుకుంటున్నారు. ఇకనైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు అక్రమట్టి త్రవ్వకాలను నిలుపుదల చేసి, డ్యామ్ సేఫ్టీ నిపుణుల కమిటీ సిఫారసు మేరకు పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# డయేరియా బాధితులకు నాణ్యమైన వైద్యం అందించాలి

### - వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 17:** డయేరియా బాధితులకు నాణ్యమైన వైద్యం అందించాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు కోరారు. దబ్బాది సార్లంక గ్రామాలకు చెందిన కుటుంబాలు ఆధ్యాత్మిక కార్యక్రమానికి వెళ్లి అక్కడ కలుషిత ఆహారం తిని వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురై రౌతులపూడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. డయేరియా బాధితులను



పరామర్శించి వారికి అందుతున్న వైద్య సేవలను, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి, ఎంపీడీవో, వైద్యాధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయమైన వైద్య సేవలు అందించడమే కాకుండా, గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, శానిటేషన్ మెరుగుపరచాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి, వాసిరెడ్డి జమీల్, వాసిరెడ్డి భాస్కర బాబు, చెన్నాడ సత్తిబాబు, వైస్ ఎంపీపీ సాయి, కాకి నాని తదితరులు పాల్గొన్నారు.

## యువకులు డ్రంకన్ అండ్ డ్రైవే
# వాహన ప్రమాదాలకు కారణమా?





**వై రామవరం, పెన్ పవర్, జూన్ 17 :** ఇటీవల మండలంలో చోటు చేసుకుంటున్న వాహన ప్రమాదాలన్ని యువత డ్రంకన్ అండ్ డ్రైవే ప్రధాన కారణమని పలువురు అంటున్నారు. మండలంలో ఇటీవల జరుగుతున్న వాహన ప్రమాదాలు అన్ని యువకులు అతిగా మద్యం సేవించి వాహనాలను డ్రైవ్ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. టూ వీలర్ వాహనంపై ట్రిపుల్ రైడింగ్, వాహనాలు నడిపే వయసు లేకపోవడం, డ్రైవింగ్ లైసెన్సులు లేకపోవడం, వాహనానికి రికార్డులు లేకపోవడం, అన్నిటికీ మించి మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నారని, అడ్డువచ్చిన వాహనంతో పాటు వీరు కూడా ప్రమాదానికి గురవుతున్నారని పలువురు అంటున్నారు. పండగైనా, ఫంక్షనైనా, మంచి చెడ్డయినా మందు ముట్టనిదే ఫంక్షన్లకు ఎలాగా హాజరవుతామని అంటున్నారని పలువురు అంటున్నారు. ఒక నెలలోనే వాహన ప్రమాదాలు సంభవించి ఐదుగురు మృత్యువాత పడ్డారని అంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వాహన ప్రమాదాలు సంభవించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

## జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ
# పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్తు సదుపాయాలకు చర్యలు చేపట్టాలి

### కలెక్టర్ షణ్మోహన్

**కాకినాడ.పెన్ పవర్ జూన్ 17 :** జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్తు సదుపాయాలు సక్రమంగా ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. పాఠశాల విద్యాశాఖ, జిల్లా పరిషత్, డ్వామా, పంచాయతీ, పాడా శాఖల అధికారులతో కలిసి పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, తాగు నీరు, కాంపౌండ్ వాల్ నిర్మాణం, న్యూట్రిన్ గార్డెన్ల పెంపకం, ఫెన్సింగ్ ఏర్పాటు, క్రీడామైదానాలు నిర్వాహణ, యోగాంధ్రా తదితర అంశాలపై అన్ని మండలాల ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ మాట్లాడారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ.. పాఠశాలలు పునః



ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అన్ని తరగతి గదులలో విద్యుత్తు సదుపాయం అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలల్లో తాగునీరుకు ఉపయోగించే ట్యాంకులను శుభ్రం చేయించి, సురక్షితమైన తాగునీరు అందించాలని ఆయన తెలిపారు. మరుగుదొడ్లులో సక్రమంగా నీరు అందుబాటులో ఉండేలా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణంలో న్యూట్రిన్ గార్డెన్ పెంపకానికి విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. న్యూట్రీన్ గార్డెన్ కు రక్షణ కల్పించే విధంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయించాలన్నారు. అన్నిచోట్ల కాంపౌండ్ వాల్ ఉండేలా చూడాలన్నారు.ఆయా పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మాణ పనులు, మరమ్మతుల నిమిత్తం పాఠశాల గదులలో వేసిన మెటీరియల్స్ ను వెంటనే తొలగించి శుభ్రం చేయించాలని, పాఠశాల క్రీడా మైదానాలను విద్యార్థులు వినియోగించుకునేందుకు అణువుగా శుభ్రం చేయించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు.సమావేశంలో డీఆర్వో జె.వెంకటరావు, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, పాడా పీడీ చైత్ర వర్షిణి, డీపీవో వి.రవికుమార్, డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మి, అన్ని మండలాల ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు, ఏపీఎంలు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి బస్టాండ్లో
# విద్యుత్ వెలుగులు

### 'పెన పవర్' వార్తకు స్పందన

**అంబాజీపేట, పెన్ పవర్, జూన్ 17** అంబాజీపేట ఆర్టీసి బస్టాండ్ లో విద్యుత్ వెలుగులు... ఈనెల 12న పెన్ పవర్లో అసౌకర్యాల నడుమ అంబాజీపేట కథనానికి ఆర్టీసి అధకారుల స్పందన అంబాజీపేట ఆర్టీసి బస్టాండులో అసౌకర్యాలతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రచురించడంతో అధికారులు స్పందించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం



చేస్తున్నారు. బస్టాండ్లో ముఖ్యంగా రాత్రి సమయంలో విద్యుత్ లైట్లు వెలుగులు అరకొరగా ఉండడంతో ప్రయాణికులు రాత్రి సమయంలో బస్సులు ఎక్కడానికి భయపడుతున్నారని కనీసం విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. దీనికి స్పందిచిన అధికారులు విద్యుత్ సౌకర్యం పూర్తి గా ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేసారు. బస్టాండ్ లో ప్రయాణికులు కూర్చునే కుర్చీలను బాగుచేయించాలని అధికారులు వీటిపైదృష్టిచారించాలని కోరుకుంటున్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
# హెల్త్ సూపర్వైజర్ మృతి

**పెనుమంట్ర, పెన్ పవర్, జూన్ 17:** మండల కేంద్రం పోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్వైజర్ గా పని చేయుచున్న ఎర్రగుంట్ల నారాయణమూర్తి (60) ద్విచక్ర వాహనం నుండి కింద పడి దురదృష్టవశాత్తు మృతి చెందారు. సోమవారం మధ్యాహ్నం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయమునకు వెళ్లి పని ముగించుకుని తిరిగి వస్తుండగా వీరవాసరం కళ్యాణమండపం దగ్గరలో వర్షంలో వాహనం ముందు చక్రం జారి పడిపోవడంతో చెయ్యి విరిగి, తలకు బలమైన గాయం తగలడం వలన అక్కడికక్కడ కుప్పకూలి పడిపోయాడు. దగ్గర్లో ఉన్న వారు 108 కు ఫోన్ చేసి కుటుంబ సభ్యులు తెలియజేసి పాలకొల్లు ఏరియా హాస్పిటల్ కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు దృవీకరించారు. మంగళవారం పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు నారాయణమూర్తికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈయన మంచిలి, ఆచంట, వేమవరం, లంకలకోడేరు, ఉండ్రాజవరం, పోడూరు పిహెచ్ సి ల లో పనిచేశారు. ఈ విషయం తెలిసిన పోడూరు పిహెచ్ సి వైద్యాధికారి డా. సుప్రజ మరియు సిబ్బంది దిగ్భ్రాంతి చెందారు.



# ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

## శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జూన్ 17:**
నేటి రాజకీయ నాయకులు ఎన్టీఆర్ ను స్ఫూర్తిగా తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి కమ్మ కళ్యాణమండపంలో సర్ ఆర్థర్ కాటన్ ఎత్తిపోతల పథకం రైతుల సమావేశం మంగళవారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ గెలిచే వరకు రాజకీయాలు, గెలిచిన తర్వాత ప్రజలే దేవుళ్ళుగా పనిచేసే వారికి ప్రజలు బ్రహ్మరథం పడతారన్నారు. పంటలకు అవసరమైన నీటిని అందించడం ఒక యజ్ఞం లా కూటమి ప్రభుత్వం భావిస్తుందన్నారు. దానికి ఉదాహరణ పంపింగ్ స్కీమ్ నిలుస్తుందన్నారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాజేశ్వరి వంటి నాయకులు,అధికారుల సమిష్టి కృషితో తాడేపల్లి గూడెం నియోజకవర్గంలో ప్రతిఫలం లభించడానికి కృషి చేసిన వారందరినీ సన్మానం



చేయడం అభినందనీయమని అన్నారు.ప్రస్తుతం ఒక పంటకు మాత్రమే పరిమిత అనుమతులు వున్నప్పటికీ రాతపూర్వకంగా తాను లేఖను ఇచ్చి రెండవ పంటకు కూడా అనుమతులు ఇవ్వనున్నట్లు ఆయన రైతులకు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులను ఎల్లవేళలా ఆదుకుంటున్నారని ఇది మంచి ప్రభుత్వమని ఆయన అన్నారు. గత ప్రభుత్వ పరిపాలనలో రైతులు వారి ధాన్యాన్ని ఎక్కడ అమ్మాలో తెలియక, డబ్బు ఎప్పుడు వస్తాదో తెలియక సతమతమయ్యారని,గాని ప్రభుత్వంలో 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయన్నారు. అక్రమ మార్గంలో రాజకీయా లను అడ్డుపెట్టుకుని ఆర్జించిన ధనం శాశ్వతం కాదన్న గుణపాఠం గత ప్రభుత్వ పాలకులను చూసి నేర్చుకొన్నారు. కానీ దానికి భిన్నంగా ఎన్.డి. ఏ ప్రభుత్వ పాలన రాష్ట్ర అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుందన్నారు. రాజకీయాల్లో గెలిచిన ఓడిన ప్రజలే దైవంగా పనిచేసే వారే ప్రజా నాయకులు అవుతారని అన్నారు. ప్రజలు చెప్పే ప్రతి పని శిరసా వహించి అమలు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. రేవడి పొలానికి రహదారి అతి త్వరలో ఎన్.ఆర్.జీ.ఎస్ (గ్రాండ్స్) ద్వారా రూ. 25 లక్షలు వెచ్చించి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ ఇమ్మని రాజేశ్వరి, బలుసు లక్ష్మణరావు, కోర కన్నయ్య, అత్తింటి సోమరాజు, పరిమి సురేష్, పరిమి సూర్యనారాయణ, పసుమర్తి సత్యనారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో ధర నిర్ణయించాలి






**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జూన్ 17:**
అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా ఫార్ములా రూపొందించి కోకో గింజలకు ధర నిర్ణయించి రైతులకు న్యాయం చేయాలని కోకో రైతుల సదస్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం తాడేపల్లి గూడెం మండలం కొమ్ముగూడెంలో శ్రీ ధనలక్ష్మి రైస్ మిల్లు ఆవరణలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోళ్ళ వెంకట సుబ్బారావు అధ్యక్షత వహించారు. సదస్సులో కోకో రైతుల సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ డిజిపి, ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఏబీ వేంకటేశ్వరరావు మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్ లో కిలో కోకో గింజలకు రూ.870 ధర ఉండగా రాష్ట్రంలో వాటిని కొనుగోలు చేసే కంపెనీలు రూ.450 మాత్రమే ధర ఇస్తూ రైతులను మోసం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కిలో కోకో గింజలకు రూ.50 సబ్సిడీ ఇవ్వడంతో గింజలకు రూ.500 ధర నిర్ణయించారని తెలిపారు. ఈ ధర ఏమాత్రం గిట్టుబాటు కాదన్నారు. కోకో రైతులను రాష్ట్రవ్యాప్తంగా సంఘటితం చేయడంతో పాటు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసి కోకో గింజలను రైతులే మార్కెటింగ్ చేసుకునే విధంగా ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం గా కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ మహత్తర కార్యక్రమానికి రిటైర్డ్ అధికారులు, చదువుకున్న యువత అనేకమంది సహకారం తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతాంగం కనీస మద్దతు ధర చట్టబద్ధత కోసం పోరాటం చేస్తున్నారని చెప్పారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులు అదనంగా 50శాతం ధర ఇచ్చినప్పుడే రైతు నిలబడగడు గుతాడని అన్నారు. రైతులు సంఘటితంగా లేకపోవడం వలన కంపెనీలు సిండికేట్ గా మారి మోసం చేస్తున్నాయని విమర్శించారు. సంఘటిత రైతు ఉద్యమమే రైతుకు రక్షణ అని చెప్పారు. కార్పొరేట్ కంపెనీల మోసాలకు వ్యతిరేకంగా కోకో రైతులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అనుగుణంగా రైతుల వద్ద ఉన్న గింజలను పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. టార్గెట్స్ అయిపోయాయని కోకో రైతులను ఇబ్బందులు గురి చేయడం తగదన్నారు. ఉద్యాన శాఖ అధికారులకు దరఖాస్తులు ఇచ్చిన తర్వాత కూడా కంపెనీల ప్రతినిధులు గింజలు కొనుగోలుకు రాకుండా రోజుల తరబడి రైతులను ఆందోళనకు గురి చేయడం అన్యాయమన్నారు. పేద రైతుల వద్ద ఉన్న కోకో గింజలు వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. కంపెనీలు ధర తగ్గించి కొనుగోలు చేస్తే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కోకో బోర్డును ఏర్పాటు చేయాలని, వెంకట్రామన్న గూడెంలో కోకో పరిశోధన కేంద్రం నెలకొల్పాలని డిమాండ్ చేశారు. విదేశీ కోకో గింజల దిగుమతులు నిలుపుదల చేయాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోళ్ళ వెంకట సుబ్బారావు, ఉప్పల కాశీ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ. హరేరాం, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ పుల్లారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కోకో గింజల సీజన్ లో అంతర్జాతీయ మార్కెట్ ధర అమలు చేయకపోవడం వలన కోకో రైతులు వందలాది కోట్ల రూపాయలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీలో సిండికేట్ విధానాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ఆలపాటి వాసు, రాయల కాశీ బాబు, గారపాటి వైకుంఠం, సూరపని వెంకట్రావు, యలమాటి బులి కృష్ణారావు, పూడి సత్యనారాయణ, మేక సూర్యనారాయణ, నడుంపల్లి ప్రసాద రాజు,వాకలపూడి రామచంద్రరావు, గుండుబోగుల బలుసులు, పరిమి వెంకటేశ్వరరావు, పిచ్చుకల అమ్మాన్ రాజా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కోకో రైతులను ఆదుకోవాలని కోరారు. నాయకులు వెలిశెట్టి సోమరాజు, ఎస్ ఆర్ కే చౌదరి, వట్టికూటి రమేష్ బాబు,యలమాటి విశ్వేశ్వరరావు, చేకూరి భాస్కరరావు, పోలిన అప్పారావు, కే సత్తిరాజు, వట్టికూటి వెంకట రామారావు, డి వీర్రాజు, కే నెహ్రూ రెడ్డి, ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వికసిత భారత్ సంకల్ప సభ

**జీలుగుమిల్లి ,పెన్ పవర్, జూన్ 17**
వికాసిత భారతదేశంలో సుపరిపాలన పేదల సంక్షేమ ధ్యేయంగా ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం పనిచేస్తుందని ఏలూరు జిల్లా బిజెపి కార్యదర్శి చాత్రాతి ప్రసాదు అన్నారు. మంగళవారం దర్భ గూడెం గ్రామంలో వికాసిత భారత్ 20 47 ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రోత్సహించి



మన రాజ్యాంగంలో పొందపరచిన ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టాలని అన్నారు. ప్రజా జీవితంలో ఎల్లప్పుడూ నిజాయితీ పారదర్శకత పాటిస్తూ జాతి ప్రయోజనాల పట్ల తిరిగిలేని నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు. వికసితభారత్ కలను సహకారం చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బొరగం వెంకటలక్ష్మి, ఏలూరు జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు వేమూరి శ్రీనివాసరావు, మండల మాజీ అధ్యక్షులు కొండపల్లి ప్రసాద్, బిజెపి మండల అధ్యక్షులు గుడ్ల రాంబాబు, నాయకులు పులగం సుబ్బారెడ్డి ,ఎన్ లక్ష్మయ్య, గడ్డం రామకృష్ణ, భీమిరెడ్డి ప్రసాద్ రెడ్డి, పైడిమర్ల కోటిరెడ్డి, కేతిరెడ్డి నెహ్రూ రెడ్డి, అలవాల సోమిరెడ్డి, పి జగదీష్, కే మురళి, ఆర్ గోపాలం తదితరులు పాల్గొన్నారు.

# అతిసార వ్యాధిపై అవగాహన గోడపత్రిక ఆవిష్కరణ




**అంబాజీపేట, పెన్ పవర్, జూన్ 17**
అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్ సి వైద్యాధికారి టి.దివ్యశ్రీ అన్నారు. ఈ నెలాఖరు వరకూ నిర్వహించే అతిసార నిరోధక కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ పార్ట్ నట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించి అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఐదేళ్ల లోపు పిల్లల వివరాలు సేకరించాలని, వాళ్లకు నీళ్ల విరోచనాలు అయితే వారిని గుర్తించి వారికి ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ టాబ్లెట్స్ ద్వారా చికిత్స అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ వో ఎం.రవికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలను కాపాడండి

## సర్పంచ్ ప్రియాంక

**పెనుమంట్ర, పెన్ పవర్, జూన్-17:**
పెనుమంట్ర గ్రామ ప్రధాన చర్చ్ వీధిలోని మండల పరిషత్ (ఎల్.ఈ.) ప్రాథమిక పాఠశాల భవనం ప్రస్తుత కేవలం ఆరుగురు పిల్లలు మాత్రమే ఉన్న స్కూల్ గా మార్చారని పెనుమంట్ర సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను తొమ్మిది రకాలుగా విభజన చేసిన ప్రభుత్వం ఈ పాఠశాల ను ఫౌండేషన్ పాఠశాల గా మార్చి కేవలం 1,2 తరగతులును మిగిల్చి, 3,4,5 తరగతులకు చెందిన 24 మంది పిల్లలను దూరంగా ఉన్న మెయిన్ పాఠశాల కు తరలించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన పాఠశాల లో ప్రస్తుతం 1వ తరగతిలో ఇద్దరు, 2లో ఇద్దరు పిల్లలు మాత్రమే ఉన్నారని అన్నారు. ఇలాగే ఉంటే వచ్చే ఏడాది పాఠశాల మూతపడి, నూతన భవనం నిరుపయోగం అవుతుందని అన్నారు. అధికారులు ఇక్కడ పిల్లలని వెనక్కి రప్పించి, పాఠశాలను కాపాడాలని సర్పంచ్ ప్రియాంక డిమాండ్ చేసారు.

# ఇంటింటా వెలుగులు నింపుతూన్న "తల్లికి వందనం"

## కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబి)

**కాకినాడ.పెన్ పవర్ జూన్ 17 :**
ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలలో ఒకటైన ప్రధాన హామీ తల్లికి వందనం ను ప్రజలు నమ్మి కూటమి ప్రభుత్వానికి బ్రహ్మరథం పట్టారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయక తల్లికి వందనం పథకం అమలు చేయడం రాష్ట్రంలో పండుగ వాతావరణం కనిపిస్తుందని కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబి) అన్నారు. వైఎస్ఆర్సిపి నాయకులు అంటే పార్టీ అధ్యక్షుడి నుంచి గ్రామస్థాయి నాయకులు వరకు ఈ పథకం విషయం చాలా విమర్శలు చేశారని, వాటి అన్నిటిని లెక్కచేయకుండా తనకు తెలిసిన విద్య మాటలతో కాదు చేతలతో చేసి చూపించిన మా నాయకుడు విజినరీ లీడర్ సంపద సృష్టికర్త ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనకు తానే సాటి, విద్యా సంవత్సరం మొదలైన రోజే ఈ పథకం అమలు చేయడంతో విద్యార్థులు తల్లిలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు, విమర్శించినవారే జేజేలు పలుకుతున్నారని, గత ప్రభుత్వం 42 లక్షల విద్యార్థులకు అమ్మ ఇస్తే, కూటమి ప్రభుత్వం 67 లక్షల విద్యార్థులకు పదివేల కోట్లకు పైగా భారీ నిధులు విడుదల చేయడం, రాష్ట్ర చరిత్రలోనే కాదు, రాష్ట్రాల చరిత్రలోనే ఉండదని, జనవరి నెలలో అమలుపరిస్తే అప్పుడు ఆ మొత్తం కోడిపందాలకు, మద్యం




సేవించుటకు ఉపయోగించే వారిని, ఇప్పుడు విద్యార్థులు స్కూల్ ఫీజులు, పుస్తకాలు ఇతర అవసరాల కోసం ఉపయోగపడుతున్నాయని విద్యార్థులు తల్లిలు అరసం వ్యక్తం చేస్తున్నారన్నారు, ఇంట్లో ఒకరు ఉంటే 13000 ఇద్దరు ఉంటే 26000 ముగ్గురు ఉంటే 39,000 నలుగురు ఉంటే 52,000 అలా ఒక్కొక్కరికి 13000 రూపాయలు చొప్పున జమవుతున్నాయని, ఈరోజు తల్లుల ఆనందంలో చిరునవ్వులు చిందిస్తున్నాయని ఈ కార్యక్రమంలో కాకర్లపల్లి చలపతిరావు,కంచిమర్తి లావణ్య, ఏటుకూరి నాగమణి, పడాల గురుమూర్తి బచ్చల కామేశ్వరరావు, మార్కండేయులు, సవరపు సత్తిబాబు,చోడిశెట్టి కృష్ణ, గుబ్బల భాస్కరరావు, గుడాల లోవరాజు, పొదరుపు ఉమా, మందారపు చిట్టిబాబు, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తల్లికి వందనంలో అర్హులను గుర్తించండి

## తల్లిదండ్రుల విజ్ఞప్తి..

**అడ్డతీగల, పెన్ పవర్, జూన్ 17**
తల్లికి వందనం పథకంలో చాలామంది తల్లులు గృహ అవసరాలకు నెలకు 300 పై చిలుకు యూనిట్స్ వాడకం జరిగింది. అనే కారణంతో తల్లికి వందనం పథకంలో అనర్హుల జాబితాలలో ఈ కుటుంబాలన్నింటిని చేర్చడం జరిగింది. కానీ వీరిలో చాలామంది పేద, మధ్య తరగతికి చెందివారు. కావున వీరు నెలకు 300 యూనిట్స్ వాడే అవకాశాలు చాలా తక్కువ ఉంటాయి. మరియు చాలా మందికి కరెంటు బిల్ తమ పేరు మీద లేకపోయినా అనర్హుల జాబితాలలోకి వెళ్లిపోయారు.వీరు అందరూ మేము అర్హులమే అని ధ్రువీకరించుకోవడానికి, ఎలాంటి ధృవీకరణ పత్రాలు సచివాలయంలో




సమర్పించాలో తెలియక, పూర్తి అవగాహన లేని చాలామంది తల్లితండ్రులు అయోమయ పరిస్థితిలో వున్నారు.ఒకవైపు ఈ నెల 20వ తారీఖు లోపు అనర్హులుఅయినవారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సచివాలయంలో సమర్పించవలసి ఉంటుంది. వీరికి తగిన సలహాలు, సూచనలు ఇచ్చేవారులేక అయోమయ పరిస్థితి లో వున్నారు.కావున సంబంధిత సచివాలయ సిబ్బంది తగినరీతిలో స్పందించి తల్లికి వందనం పథకంలో అనరవ్హులైన తల్లితండ్రులకు సంబంధిత ధ్రువపత్రాలు సరైన టైములో సచివాలయం లో ఇచ్చే విధంగా సలహాలు, సూచనలు ఇవ్వవలసిందిగా తల్లితండ్రులమైన మేము అధికార్లను వేడుకుంటున్నాము.

# ఐఐఎఫ్‌టి నిర్మాణానికి కేంద్రం నిధులు విడుదల

## త్వరలోనే పనులు ప్రారంభం

## ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వెల్లడి

**కాకినాడ,పెన్ పవర్ జూలై 17:**
యు. కొత్తపల్లి మండలం పొన్నాడ వద్ద నిర్మించనున్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ ( ఐ ఐ ఎఫ్ టి) క్యాంపస్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 25 కోట్లు నిధులు విడుదల చేసిందని, ఈ మేరకు మంగళవారం సంబంధిత శాఖకు నిధులు బదిలీ అయ్యాయని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ల క్రితం కాకినాడకు ప్రతిష్టాత్మక ఐ ఐ ఎఫ్ టి మంజూరు అవ్వగా, జేఎన్టీయూ తరగతులు నిర్వహిస్తున్నారని, గత ప్రభుత్వ హయాంలో క్యాంపస్ శాశ్వత నిర్మాణానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50 శాతం నిధులు భరించేలా రూ 229.81 కోట్ల వ్యయంతో పొన్నాడ వద్ద 25 ఎకరాలు విస్తీర్ణంలో క్యాంపస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. అయితే గత వైసిపి ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు విడుదల చేయకపోవడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించ డంతో క్యాంపస్ నిర్మాణం మధ్యలో ఆగిపోయిందన్నారు. ఈ దశలో గత ఏడాది నవంబర్ లో క్యాంపస్ నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని కేంద్రమంత్రి



పీయూష్ గోయల్ ను వ్యక్తిగతంగా కలిసి కలిసి ఒత్తిడి తేవడం తో పాటు రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధుల కోసం చొరవ తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను అభ్యర్థించడం జరిగిందన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్రం క్యాంపస్ నిర్మాణం పూర్తి చేసేందుకు రూ. 25 కోట్లు నిధులు విడుదల చేసిందని తెలిపారు. పెండింగ్ నిధులు విడుదల అవడంతో త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని, త్వరిత గతిన పనులు పూర్తి చేసి క్యాంపస్ ను అందుబాటులో తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా నిధులు విడుదలకు సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఎడారీరణ, కరువు నివారణ దినోత్సవం

**కాకినాడ.పెన్ పవర్ జూన్ 17 :**
స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం, ఐ డి ఎ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఎడారీకరణ, కరువు నివారణ దినోత్సవం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ, పీ జీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలియజేశారు. ఆదిత్య డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) లో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన శ్రీ సత్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యనిపుణులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ఎడారీకరణ, కరువును ఎదుర్కొనేందుకు ప్రపంచ దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 17న జరుపుకుంటారని, ఈ రోజుని ఎడారీకరణ, కరువుకు సంబంధించిన సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించమని తెలిపారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన భూమి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకు ఆధారం, ప్రపంచ జిడిపి లో సగానికి పైగా ప్రకృతిపై ఆధారపడి ఉంటుంది. అటువంటి ప్రకృతిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్చార్జి ఎన్ మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తేజేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం తగదు

## జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్

## తల్లికి వందనం పథకం ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థులకు మేలు




**కాకినాడ.పెన్ పవర్ జూన్ 17 :**
కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో మొదటి దశలోనే తల్లికి వందనం పథకం కింద 67.27 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చిందని కాకినాడ జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు.గత పాలనలో ఈ పథకం కేవలం 42 లక్షల మందికి మాత్రమే పరిమితమైందని, ఇప్పుడున్న ప్రభుత్వ హస్తక్షేపంతో ప్రతి విద్యార్థికి మేలు జరుగుతున్నదని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రతిపక్ష వైకాపా నాయకులు బాధ్యతారహితంగా దుష్ప్రచారం చేస్తూ ప్రజల అవగాహనను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ప్రజలు ఇప్పటికే వారి అసత్య ప్రచారాన్ని తిరస్కరిస్తున్నారు," అన్నారు.జగన్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం అనే భావనలు లేకుండా, విధ్వంసం, అక్రమాలు, అన్యాయాలే కొనసాగించారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏడాదిలోపే రోడ్ల నిర్మాణం, సంక్షేమ పథకాల అమలుతో అభివృద్ధి కార్యక్రమాలను బలోపేతం చేశారని తెలిపారు.అమరావతి విధ్వంసం, ప్రజా వేదిక కూల్చివేత వంటి చర్యలు అప్పటి ప్రభుత్వానికి ప్రజా వ్యతిరేకతను తెచ్చిపెట్టినాయని వ్యాఖ్యానించారు.ప్రస్తుతం ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాలను వరుసగా ప్రవేశపెడుతున్నామని చెప్పారు.రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రభాగంగా నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ప్రధాని నరేంద్ర మోదీ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఇతర కేంద్ర, రాష్ట్ర మంత్రులు సమన్వయంగా కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పెంకే శ్రీనివాస బాబా, చప్పిడి వెంకటేశ్వరరావు, ఉంగరాల బూరిబాబు, ఎండి జహీరుద్దీన్ జిలానీ, తదితరులు పాల్గొన్నారు.

## తాడేపల్లిలో వైఎస్ జగన్‌ను కలసిన మురళీ రాజు...

### నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గ విషయాలపై చర్చించిన ముదునూరి...



**ప్రత్తిపాడు, పెన్ పవర్, జూన్ 17 :**
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు వై. ఎస్ జగన్ మోహన రెడ్డిని తాడేపల్లి నివాసంలో నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణం రాజు మర్యాద పూర్వకంగా కలిసారు. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ విషయాలపై చర్చించినట్టు ముదునూరి తెలిపారు.

## అతిసార వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమం



**సీతానగరం, పెన్ పవర్, జూన్ 17:**
సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పిహెచ్ సి వైద్య అధికారి డాక్టర్ ఏ వి కే చైతన్య, డాక్టర్ కే సునీల్ ఆధ్వర్యంలో పీహెచ్ సి సిబ్బందితో అతిసార నియంత్రణ కార్యక్రమం స్టాప్ డయోరియా క్యాంపెయిన్ సందర్భంగా అతిసార వ్యాధి గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు, ఈ సందర్భంగా డాక్టర్ ఏవీకే చైతన్య మాట్లాడుతూ అతిసార వ్యాధి అపరిశుభ్ర పరిసరాలు కలుషితనీరు కలుషిత ఆహారం తీసుకోవడం వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటం వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం ద్వారా వస్తుందని ఈ వ్యాధిని అశ్రద్ధ చేస్తే శరీరంలో నీరు విరేచనాల ద్వారా బయటకు పోయి ప్రాణాపాయం సంభవిస్తుంది కావున సకాలంలో ఓ ఆర్ ఎస్ ద్రావణం మరియు జింక్ మాత్రలు తీసుకోవడం వలన ప్రాణాపాయం నుండి తప్పించుకోవచ్చు అని చెప్పారు, విరేచనాలు అశ్రద్ధ చేయకుండా మీ ఊర్లోనే ఆశా కార్యకర్తను కలిసి ఆమె సహాయంతో మీ ఊరిలో ఉన్నా ఆరోగ్య కేంద్రం వద్దకు వెళ్లి డాక్టర్ ద్వారా వైద్య సహాయం పొందవచ్చుని చెప్పారు, జూలై నెలఖరువరకూ వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి గ్రామంలోనూ అతిసార వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు, ఈ కార్యక్రమంలో ఎమ్ ఎల్ హెచ్ పి. ఓవై ఎస్ రాయుడు, పిచ్ ఎన్ ఆదిలక్ష్మి, సూపర్వైజర్ కే .సుధాకర్, ఎమ్ ఎల్ హెచ్ పి లు హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు , ఆసుపత్రి ఓపి సిబ్బంది పాల్గొన్నారు,

## పెనుగొండలో నేడు పల్లె పల్లెకు పితాని కార్యక్రమం

**పెనుమంట్ర, పెన్ పవర్, జూన్-17:**
పెనుగొండ మండలంలో అచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ నేడు "పల్లె పల్లెకు మన పితాని" కార్యక్రమంలో పాల్గొనున్నారు. మండలంలోని చినమల్లం గ్రామంలో 09:00 గంటల నుండి 11:00 గంటల వరకుపంచాయతీ వద్ద మండల స్థాయి అధికారుల బృందం మరియు ప్రజలతో ముఖాముఖి చర్చా కార్యక్రమంలో పాల్గొనున్నారు. 11:00 గంటల నుండి 12:00 గంటల వరకు ఎంపీటీసీ బొక్క ఏడుకొండలు ఇంటి వద్ద జరుగు కూటమి కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం"కార్యక్రమానికి హాజరుకానున్నారు. నడిపూడి గ్రామంలో 04:00 గంటల నుండి 06:00 గంటల వరకు పంచాయతీ దగ్గరలో మండల స్థాయి అధికారుల బృందం మరియు ప్రజలతో ముఖాముఖి చర్చా కార్యక్రమంలో పాల్గొనున్నారు. 06:00 గంటల నుండి 07:00 గంటల వరకు తిరుమల



ఇంటి వద్ద జరుగు కూటమి కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం" కార్యక్రమానికి హాజరుకానున్నారు. కావున తెలుగుదేశం, జనసేన,బిజెపి మండల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు,ముఖ్య నాయకులు,కార్యకర్తలు అభిమానులు పాల్గొవాలని పితాని క్యాంపు కార్యాలయం తెలిపింది.

## డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 17:**
జగ్గంపేట పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో జగ్గంపేట జనసేన ఇంచార్జ్ మరియు తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఈ మంగళవారం అన్నదానం కార్యక్రమాన్ని జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరై క్యాంటీన్ ను ప్రారంభించి పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ తమ నాయకుడు పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో డొక్కా సీతమ్మ క్యాంటీన్ గత సార్వత్రిక ఎన్నికల అనంతరం నుంచి నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బుదిరెడ్డి శ్రీనివాస్, మాదాపు వీరబాబు, కురుముళ్ల నాగేశ్వరావు, సూరపురెడ్డి నరేష్, సత్తి సోమరాజు, మొగిలి గంగాధర్, గంధం శ్రీను, శ్రీమన్నారాయణ, డ్రిల్ మాస్టారు, ముత్యాల సుబ్బారాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జేఎన్టీయూకే యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సెల్‌కు రాష్ట్రస్థాయిలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అవార్డు

**కాకినాడ.పెన్ పవర్ జూన్ 17 :**



జేఎన్టీయూకే యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సెల్ కు రాష్ట్రస్థాయిలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అవార్డు రావడం అభినందనీయమని ఉపకులపతి సి ఎస్ ఆర్ కె ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం వీసీ చాంబర్ నందు ఎన్ఎస్ఎస్ సెల్ కు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర స్థాయి అవార్డు వచ్చిన సందర్భంగా జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి శ్యామ్ కుమార్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లను ఉపకులపతి అభినందించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రో.సి ఎస్ ఆర్ కె ప్రసాద్ మాట్లాడుతూ సమాజానికి ప్రజా అవసరాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు చేస్తున్న సేవలు హర్షనీయమన్నారు. గుంటూరులో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర డైరెక్టర్ వై డి రామారావు అధ్యక్షతన నిర్వహించిన ప్రపంచ రక్త దాతలు దినోత్సవాన్ని పురస్కరించుకొని 2023-2024 విద్య సంవత్సరానికి గాను అత్యధికంగా రక్తాన్ని సేకరించిన విద్యాసంస్థగా జేఎన్టీయూకే యూనివర్సిటీ నిలచినందుకు జేఎన్టీయూకే ఎన్ ఎస్ఎస్ సెల్ కు రాష్ట్ర వైద్యశాఖ మంత్రి వై సత్య కుమార్ యాదవ్ చేతులమీదుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్రస్థాయి ద్వితీయ స్థాయి అవార్డును జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి శ్యామ్ కుమార్




అందుకోవడం జరిగిందన్నారు. జేఎన్టీయూకే అనుబంధ కళాశాలలు ఎన్ఎస్ఎస్ యూనిట్స్ కృషితోనే జేఎన్టీయూకే యూనివర్సిటీకి ప్రతిష్టాత్మకమైన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర స్థాయి అవార్డు లభించిందని ఈ అవార్డు లభించడానికి సహకరించిన అధికారులు సిబ్బంది అనుబంధ కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్స్ శ్యామ్ కుమార్ తెలిపారు. అనంతరం ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్ఆర్కె ప్రసాద్ తో పాటు డాక్టర్ ప్రొఫెసర్ కె.వి.రమణ ఇన్చార్జి రిజిస్టర్ ప్రొఫెసర్ బి రవీంద్రనాథ్ స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి కృష్ణమోహన్ యూసీఈకే ప్రిన్సిపల్ ఎన్ మోహన్ రావు జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి శ్యామ్ కుమార్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కె రమణ జి ఎం వి ఎస్ ఎస్ వి కిరణ్మయి డాక్టర్ పి వీరలక్ష్మి సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

## రోడ్డు విస్తీర్ణం కొరకు 14 రోజుల గడువు పెంపు కోరుతూ వినతి పత్రం..

**అడ్డతీగల, పెన్ పవర్ ,జూన్ 17**
అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ అడ్డతీగల మండల కేంద్రంలో రహదారి వెడల్పు నిమిత్తం స్వచ్ఛందంగా రహదారి కి సంబంధించిన స్థలము ఖాళీ చేయడం జరిగిందని, దీని నిమిత్తం కొంతమేరకు ఖాళీ చేయవలసిన వాటి గురించి మండల రెవెన్యూ అధికారి వారికి రెండు వారాలు సమయం కోరుతూ వాణిజ్య మరియు గృహాల యాజమాన్యం తహసీల్దార్ వారికి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బాధితులు పలువురు హాజరయ్యారు.



## కిర్లంపూడి మండలం వ్యవసాయ శాఖ అధికారిణిగా సుధామాధురి



**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 17:**
కిర్లంపూడి మండలం వ్యవసాయ శాఖ అధికారిణిగా నాగం సుధామాధురి మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.ఇప్పటి వరకు కిర్లంపూడి మండలం వ్యవసాయ శాఖ అధికారిణిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన జోకా అమృత ప్రత్తిపాడు మండలం వ్యవసాయ శాఖ అధికారిణిగా బదిలీ అయ్యారు.దీంతో సామర్లకోట భూసార పరీక్షా కేంద్రం ఎ ఒ గా పనిచేస్తున్న నాగం సుధామాధురి కిర్లంపూడి బదిలీ అయ్యారు. దీంతో మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సుధామాధురి విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను రైతులకు వివరించడమే కాకుండా, ఆధునిక వ్యవసాయ పద్ధతులను తెలియజేసి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా రైతులకు సహకరిస్తానన్నారు. రైతులు, కౌలు రైతులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని సేంద్రియ వ్యవసాయంపై మొగ్గుచూపుటమే కాకుండా, తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన పంటలు పండించాలని రైతులను ఈ సందర్భంగా కోరారు.

## ఫిజియోథెరపీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

### మండల విద్యాశాఖాధికారి చౌదరి

**పెద్దాపురం, పెన్ పవర్, జూన్ 17:**
భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి వి.ఆర్.కె. చౌదరి అన్నారు. పెద్దాపురం పట్టణంలో స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గల భవిత కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఏవిధంగా విద్యను బోధిస్తున్నారు, ఫిజియోథెరపీ



వైద్య శిబిరం వివరాలను అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు చికిత్స, సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. వివిధ కారణాలతో దివ్యాంగులైన చిన్నారుల బంగారు భవిష్యత్‌కు వీటి ద్వారా భరోసా ఇస్తోందని, వైకల్యాన్ని జయించి వారు జీవితంలో రాణించేందుకు మార్గం చూపుతోందని తెలిపారు. అనంతరం భవిత కేంద్రానికి సంబంధించిన అన్ని రికార్డులు, సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అన్ని రకాల సౌకర్యాలు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పద్మశ్రీ, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ బి. అపర్ణ, భవిత సిబ్బంది బి. దుర్గాప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జగన్ అంటే నమ్మకం..

## చంద్రబాబు అంటే మోసం పుస్తక ఆవిష్కరణ

జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 17:

మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తోట నరసింహం ఆదేశాల మేరకు జగ్గంపేట వైసీపీ కార్యాలయంలో జగ్గంపేట మండల వైసిపీ అధ్యక్షులు రావుల గణేష్ రాజా ఆధ్వర్యంలో మంగళవారం జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. రావుల గణేష్ రాజా మాట్లాడుతూ




కూటమి ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఈ సంవత్సర కాలంలో పేదవారికి ఏమీ ఒరిగింది లేదన్నారు. అశాంతి, అరాచకం, ఆటవిక పాలన, క్షీణించిన లాండ్ ఆర్డర్ చట్టం, రాజ్యాంగ ఉల్లంఘన, మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు, వేధింపులు, అన్యాయాలు, అబద్ధాలు, విష ప్రచారాలు, దుర్మార్గాలు, వివక్ష, అంతులేని అవినీతి, విద్య, వైద్యం, వ్యవసాయం ఘోరం, ఉన్మాద రాజకీయాలు, తన కోసమే తన వాళ్ల కోసమే ఈ ప్రభుత్వం పని చేస్తుందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో వరుపుల సూరిబాబు, కరటూరి వీర్రాజు, కాపవరపు ప్రసాద్, గుర్రం మహాలక్ష్మి, గిడియాల పెద్దకాపు, నకిరెడ్డి ఆది విష్ణు చక్రవర్తి, వైసిపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధి పనులు పరిశీలన



పెద్దాపురం, పెన్ పవర్, జూన్ 17 :

మండల పరిధిలోని కట్టమూరు గ్రామంలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను పెద్దాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి గుత్తుల సూర్యావతి మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పలు పనులను ఫీల్డ్ అసిస్టెంట్ ను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలన్నారు. పంట కాలువల అభివృద్ధి, పుంత రోడ్లు, చెరువుల్లో పూడికతీత పనులు మొదలయినవాటిని నాణ్యతతో చేపట్టాలన్నారు. పని ప్రదేశంలో వేతనదారులకు అందుతున్న సదుపాయాలపై ఆమె ఆరా తీశారు.

# ప్రజలకు జవాబిదారి వ్యవస్థగా కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే పితాని

పెనుమంట్ర, పెన్ పవర్, జూన్ 17:

రాష్ట్ర ప్రజలకు మేలు చేసి, జవాబు దారి వ్యవస్థ గా కూటమి ప్రభుత్వం ఉంటుందని మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలో జుత్తిగ, వెలగల వారి పాలెం లో పల్లె పల్లెకు మన పితాని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రజలకు జవాబిదారి వ్యవస్థ కూటమి ప్రభుత్వం వల్ల సాధ్యమవుతుందని మీరిచ్చిన అధికారంతో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం సంక్షేమం తప్ప అభివృద్ధి నోచుకోలేదని రహదారులు లేకపోయినప్పటికీ ప్రశ్నించే నాయకులు ఏమయ్యారని విమర్శించారు అధికారం లోకి ఏడాది కాలంలోనే రహదారుల గుంతలు






కూర్చొని కొత్త రహదారులు పూర్తి చేయడం జరిగిందని అన్నారు. గత పాలకులు గ్రామాల్లో లో వోల్టేజ్ సమస్య ఉంటే ట్రాన్స్ఫార్మర్లు కూడా ఏర్పాటు చేయలేని అసమర్థులని అన్నారు రెండు ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికి తల్లికి వందనం పథకం అమలు చేసామని అన్నారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం కుల మత పార్టీలకతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అభివృద్ధి సంక్షేమ పథకాలు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందన్నారు.

**కూటమి నాయకుడు ఐక్యతతో ముందుకు సాగాలి..** జనసేన టిడిపి బిజెపి నాయకులు చిన్న చిన్న మనస్పర్ధలు ఉంటే పక్కన పెట్టి ప్రజల కోసం పార్టీ కోసం ఐక్యతతో ముందుకు సాగాలని మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. కూటమి పార్టీల నాయకులు విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సమిష్టిగా పనిచేసి విజయకేతనం ఎగరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి సర్పంచ్ సర్పంచ్ వెలగల సుగుణమ్మ, ఎంపీటీసీ మాంద్రు కుమారి, బిజెపి నాయకులు కృష్ణారెడ్డి, కడలి ఏడుకొండలు, గూడూరు మురళి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, జుత్తిగ లక్ష్మణ్, తాసిల్దార్ వై రవికుమార్ ఎంపీడీవో ఎమ్మెస్ ప్రభాకర్ రావు వివిధ శాఖ అధికారులు జనసేన బిజెపి టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# తల్లికి వందనం ఒక చరిత్ర

## - టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రవి కొండపల్లి

టీ నర్సాపురం, పెన్ పవర్, జూన్ 17 :

మునుపెన్నడూ లేని సంక్షేమం.. విద్యాశాఖలో లోకేష్ మార్క్ అభివృద్ధి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తల్లికి వందనం పథకం దేశంలోనే చారిత్రకఅధ్యాయాన్ని లిఖించిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొండపల్లి రవి అన్నారు .టి నర్సాపురం మండలం టి నర్సాపురం గ్రామంలో ఉన్న సచివాలయం నందు తల్లికి వందనం పథక లబ్ధిదారులైన విద్యార్థులు మరియు వారి యొక్క తల్లులతో ఏర్పాటుచేసిన కృతజ్ఞత సభలో కొండపల్లి రవి మాట్లాడుతూ ముందుగా విద్యార్థులు మరియు వారి యొక్క మాతృమూర్తులతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు యొక్క చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు అనంతరం యువనేత రాష్ట్ర ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్నేతృత్వంలోరూపొందించిన విద్యార్థుల కిట్లను ఉచిత పాఠ్యపుస్తకాలను గ్రామ పెద్దలు మరియు స్కూల్ సిబ్బందితో కలిసి విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం ద్వారా ఒకే కుటుంబంలో ఎంతమంది విద్యార్థిని విద్యార్థులు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి 13 వేల రూపాయలు వారి ఖాతాలో జమ చేయడం తెలుగు రాష్ట్రాలను కేక దేశ చరిత్రలోనే ఒక చారిత్రక అధ్యాయమని అన్నారు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి పేరు కింద ఇంట్లో ఎంతమంది చదువుకునే విద్యార్థిని విద్యార్థులు ఉన్నప్పటికీ కేవలం ఒక్కరికి మాత్రమే డబ్బులు ఖాతాలో జమ చేసిన సందర్భాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు ఒక కుటుంబంలో ఇద్దరూ లేదా అంతకు మించిన సంతానం ఉంటే కేవలం ఒక్కరికి మాత్రమే చదువుకోవటానికి ఆర్థిక సహాయం అందజేస్తే మిగిలిన వారి పరిస్థితి ఏమిటి అని నాడు ప్రశ్నించామని అదే ప్రశ్నని యువగళం పాదయాత్రలో లోకేష్ కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించి, మేము అధికారంలోకి వస్తే ఎంతమంది విద్యార్థినీ విద్యార్థులు ఉంటే అందరికీ తల్లికి వందనం పథకం వర్తింప చేస్తామని నాడు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ నేడు ఎంతమంది చదువుకునే విద్యార్థిని విద్యార్థులు ఉంటే అంతమందికి వేసి మాట నిలబెట్టుకుని తల్లుల ముఖాల్లో సంతోషాన్ని నింపిన నాయకుడు లోకేష్ అని ఈ సందర్భంగా తెలిపారు. అదే విధంగా మునిపెన్నడూ లేని విధంగా నారా లోకేష్ నాయకత్వంలో మధ్యాహ్న భోజన పథకంలో సన్నబియ్యాన్ని విద్యార్థిని విద్యార్థులకు



అందించిన ఏకైక నాయకుడు లోకేష్ అని ఈ సందర్భంగా లోకేష్ ప్రత్యేకంగా అభినందిస్తూ ప్రశంసించారు. అలాగే నాణ్యమైన కిట్లను పార్టీ పుస్తకాలను బడులు తెరిచిన మొదటి రోజే స్కూళ్లకు చేరేలా పక్కా ప్రణాళికతో వారు పని చేశారని విద్యావ్యవస్థలో అద్భుత మార్పులు తీసుకొచ్చి ప్రైవేటు కళాశాలలు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతున్నారని శేషు తెలిపారు. విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా విద్యాశాఖను సమర్థవంతంగా నడిపిస్తున్నారని లోకేష్ కు కితాబిచ్చారు. అదే విధంగా 16 347 టీచర్ ఉద్యోగాల కోసం డీఎస్సీ పరీక్షలు నిర్వహించి త్వరలోనే టీచర్ పోస్టులనుభర్తీచేస్తున్నందుకునిరుద్యోగ యువత తరపున లోకేష్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలపార్టీ అధ్యక్షులు అడపా నాగరాజు ,పాలేటి సత్యనారాయణ టిడిపి నాయకులు కాసనేని వెంకట్రావు, పేరం రాంబాబు పెద్దిన సత్యనారాయణ ,నవీన్ ,మండం ఆధిత్య నిమ్మగడ్డ రామచంద్రరావు, చింతలపాటి రవి ,బైగాని నాగు సచివాలయ సిబ్బంది మరియు అధిక సంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామ గ్రామాన ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు

## ఆర్యవటంలో కూటమి నేతలు కేక్ కటింగ్... రక్తదాన,కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు





కాజులూరు,పెన్ పవర్,జూన్ 17 :

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ జన్మదిన వేడుకలు మంగళవారం పలు గ్రామాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. కాజులూరు మండల పరిధిలోని ఆర్యవటం గ్రామంలో చందాల ఆదినారాయణ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు కోట తాతబ్బాయి, పెంకే అప్పారావు,గ్రామ కమిటీ అధ్యక్షులు కురు పూడి దొరబాబు,మాజీ సర్పంచ్ పద్మావతి,పంచాయతీ కార్యదర్శి కె.సూరిబాబు,కూటమి కార్యకర్తలు తదితరులు మంత్రి సుభాష్ పుట్టినరోజు వేడుకను పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలో పాళీపూడి సూర్య నారాయణ అనే ఇంజనీరింగ్ విద్యార్థి పై చదువులకు దోహద పడేందుకు చందాల ఆదినారాయణ చారిటబుల్ ట్రస్ట్ తరపున కూటమి నేతల సమక్షంలో రూ. 10,వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు చందాల ఆదినారాయణ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు విద్యార్థుల ఉన్నత చదువులకు అడ్డుకారాదన్నారు. ట్రస్ట్ తరపున యువత పై చదువులకు దోహద పడాలనే ఉద్దేశంతో సహకారం అందించడం జరిగిందన్నారు. అందునా మంత్రి సుభాష్ పుట్టినరోజు వేడుక సందర్భంగా ఇలాంటి సేవాకార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అలాగే వెంకటాయ పాలెంలోని పేపకాయల బాబ్జి కళ్యాణమండపంలోమంత్రి సుభాష్ పుట్టినరోజును కూటమి నాయకులు పండుగలా నిర్వహించారు. ఈ వేడుకకు కూటమి నాయకులు, అధికారులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ అభిమాన నాయకునికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి సుభాష్ జన్మదిన వేడుకలు చేసుకునేందుకు ఆసక్తి చూపకపోయినా? కూటమి నాయకులు అభిమానుల కోరిక మేరకు రామచంద్రపురంలో మంత్రి వారికి అందుబాటులో ఉన్నారు. తనను విష్ చేసేందుకు పూల గుచ్చాలు, ఫ్లెక్సీలు, హోర్డింగులు, బర్త్ డే కేకులు వంటివి తీసుకురావద్దని వాటికి వెచ్చించే డబ్బులు పేదలను ఆదుకునేందుకు ఉపయోగించాలని ఆయన ముందుగానే పిలుపునిచ్చిచ్చారు. మంత్రికి తమ శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజక వర్గంలోని ప్రజలు పెద్ద ఎత్తున బారులు తీరారు. మంత్రి సుభాష్ పుట్టినరోజుని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం, ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ క్యాంపులను తొలుత రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించి రక్తదాతలను ప్రోత్సహించి , వారిని అభినందించారు. రక్తదానం చేసిన వారికి లక్ష రూపాయల ప్రమాద బీమా కవర్ అయ్యేలా సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే ఉచిత నేత్ర వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు, సీనియర్ నాయకులు



డాక్టర్ చుండ్రు వీర్రాజు చౌదరి, చుండ్రు రుద్రాచౌదరి,గొల్లపాలెం సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక, గ్రామ కమిటీ అధ్యక్షులు నక్క శ్రీను, అంగర కృష్ణ,అంగర శ్రీను,శలపాక నీటి సంఘం అధ్యక్షులు తాడి మాచారెడ్డి, బంధన పూడి, గొల్ల పాలెం నీటి సంఘం అధ్యక్షులు సలాది శ్రీనివాస్,తాత బ్బాయి,కోకా హరి,గుబ్బల ఏసురాజు, దేగల సతీష్,తోట కృష్ణ, అధికారులు, ప్రజాప్రతినిధులు,కూటమి పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ఉచిత నేత్ర వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

# ఘనంగా మంత్రి సుభాష్ జన్మదిన వేడుకలు

## మెగా రక్తదాన, కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు

కె గంగవరం పెన్ పవర్ జూన్ 17:

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ జన్మదిన వేడుకలు వెంకటయ్య పాలెంలోని పేపకాయల బాబ్జి కళ్యాణమండపంలో పండుగల నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి పార్టీ నాయకులు, అధికారులు, అభిమానులు, ప్రజలు, అత్యధికంగా యువత స్వచ్ఛందంగా తరలివచ్చి తమ అభిమాన నాయకునికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సుభాష్ జన్మదిన వేడుకలు చేసుకునేందుకు ఆసక్తి చూపకపోయినా కూటమి నాయకులు అభిమానుల కోరిక మేరకు రామచంద్రపురంలో అందుబాటులో ఉన్నారు. తనను విష్ చేసేందుకు పూల గుచ్చాలు, ఫ్లెక్సీలు ,హోర్డింగులు, బర్త్ డే కేకులు వంటివి తీసుకురావద్దని వాటికి వెచ్చించే డబ్బులు పేదలను ఆదుకునేందుకు ఉపయోగించాలని పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. మంత్రి సుభాష్ గారికి శుభాకాంక్షలు తెలిపే నందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలు పెద్ద




ఎత్తున బారులు తీరారు. మంత్రి సుభాష్ పుట్టినరోజుని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం, ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. క్యాంపులను తొలుత రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించి రక్తదాతలను ప్రోత్సహించారు. 51 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి లక్ష రూపాయల ప్రమాద బీమా కవర్ అయ్యేలా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అలాగే ఉచిత నేత్ర వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పుట్టినరోజు వేడుకలు ఆధ్యాంతం పండుగ వాతావరణాన్ని తలపించాయి.

## డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ



ఆలమూరు, పెన్ పవర్, జూన్ 17

మండల కేంద్రమైన ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను మంగళవారం మండల విద్యాశాఖ అధికారి, ప్రధానోపాధ్యాయులు బి అప్పాజీ ఆధ్వర్యంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ నారిపరెడ్డి వరలక్ష్మి,జనసేన నాయకులు, మండల కాపునాడు అధ్యక్షులు,పాఠశాల పేరెంట్స్ కమిటీ కో అప్డేట్ మెంబర్ చల్లా బాబి విద్యార్థులకు అందజేశారు. పంపిణీ చేసిన విద్యార్థి మిత్ర కిట్లను వారు పరిశీలించారు. అందించిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బూట్లు, సాక్సులు, డిక్షనరీలు, బ్యాగులు, బెల్టులు సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చల్లా బాబి మాట్లాడుతూ ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాలలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఉచితంగా అందిస్తున్న ఈ పాఠ్యపుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ పి సత్యనారాయణ, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

### కూటమి ప్రభుత్వంలో అనేక సమస్యలు

## రోడ్లు మెరుగుపడ్డాయి..

### టిడిపి, జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య..

పెన్ పవర్, గుంటూరు, జూన్.17:

ఈ రాష్ట్రాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రావణకాష్టంలా, అప్పుల కుప్పలా మార్చింది, ఈ కూటమి ప్రభుత్వంలో అనేక సమస్యలు రోడ్లు మెరుగుపడ్డాయి కానీ గత ప్రభుత్వంలోగంటకు 3-4 అత్యాచార ఘటనలు మహిళలపై జరుగుతున్నాయి.

90% హామీలు నెరవేర్చడా ? మేనిఫెస్టో దగ్గర పెట్టుకుని ఒక్కొక్క లైన్ చదువుకోండి. ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మీ వైసిపి పాలనలో ఆడపిల్లలు పుట్టడమే పాపం అన్నట్టుగా ఉంది.



తొలి ఏడాదిలోనే 90% హామీలు అమలు పరిచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ది గత ప్రభుత్వంలో ఏడాది గడిచినా 9% హామీలు కూడా నెరవేర్చని స్థితిలోగత వైసిపి ప్రభుత్వం ఉంది.ఈ ప్రభుత్వం అమలు పరిచిన పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకే వచ్చే నెల ఒకటో తారీకు నుంచి ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలుపరిచిన పథకాలు అమలుపరిచే కాబోయే పథకాల గురించి వివరించడానికి నేను సైతం అనే విధంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అందరము డోర్ టు డోర్ వెళ్లి కట్ట ప్రభుత్వం ఏం చేసిందని మన ప్రభుత్వం వచ్చి సంవత్సరంలో ఎన్ని పనులు ఎంత అభివృద్ధి చేసిందని విధానాన్ని ప్రజలకు వివరంగా చెప్పటానికి సిద్ధంగా ఉన్నామని జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు.

## మంత్రి నారా లోకేష్ పై చేసిన ఆరోపణలు నిరూపించకపోతే వైసీపీ పార్టీ మూసివేయాలి..

### ఎమ్మెల్యే గళ్ళా మాధవి..

పెన్ పవర్, గుంటూరు, జూన్.17:

ఎన్డీయే కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనంను అమలు చేస్తే అది చూసి తట్టుకోలేని జగన్ రెడ్డి %ఽ% కో నారా లోకేష్ మీద విషం చిమ్ముతుందని, దీనిని తాము ఏ మాత్రం సహించమని, చేసిన అసత్య ఆరోపణలు నిరాధారం అని ప్రజలకు క్షమాపణలు చెప్పాలని, నిరూపించపోతే వైసీపీ పార్టీ మూసివేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి డిమాండ్ చేసారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భముగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ...ఎన్నికలకు ముందు తల్లికి వందనం ఇచ్చిన హామీ ప్రకారం ఎంతమంది ఉంటె అంతమందికి "తల్లికి వందనం" డబ్బులు జమచేశాము.సంక్షేమం జరుగుతుంటే వైసీపీ నిరాధార ఆరోపణలు చేస్తూ నారా లోకేష్ మీద విషమ చిమ్ముతుంది. వైసీపీ పాలనలో రూ.13 వేలు ఇచ్చారు. అంటే రూ.2 వేలు జగన్ జేబుల్లోకి పోయాయా? తాడేపల్లి ప్యాలెస్ కు చేరాయా? అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రశ్నించారు. వైసీపీ చేసిన విమర్శలను చూసి ప్రజలు వైసీపీ అసహ్యించుకుంటున్నారు.

ఇది వైసిపీలాగా అబద్దపు హామీలతో గెలిచి, మోసం చేసిన వైసిపి ప్రభుత్వం కాదు, ప్రజా మద్దతుతో గెలిచిన ప్రభుత్వమన్న విషయం జగన్ రెడ్డి కో గుర్తించుకోవాలి. తమ మనుగడ కోసం నిరాధార ఆరోపణలు చేస్తాము అంటే కుదరదని హెచ్చరించారు. జగన్ పాలనలో 42 లక్షల మందికి మాత్రమే ఇస్తే కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇస్తుందని, కుటుంబంలో ఒక్కరికే అనే షరతు పెట్టి పేద, మధ్య తరగతి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను జగన్ మోహన్ రెడ్డి మానసికంగా వేధింపులకు గురి చేసారని 2019 ఎన్నికల ప్రచారంలో "మీ ఇంట్లో ఇద్దరు పిల్లల్ని బడికి పంపండి ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున ఇస్తాము" అంటూ మీ సతీమణి, సాక్షి పత్రిక యజమాని, భారతి రెడ్డి ప్రచారం చేయలేదా? అని ఎమ్మెల్యే విమర్శించారు. జగన్ హయాంలో ప్రతియేటా వివిధ కారణాలతో లబ్ధిదారులను తగ్గించుకుంటూ పోయారని 2021లో 44.48 లక్షల మంది లబ్ధిదారులు ఉంటే 2023కి ఆ సంఖ్య 42.61 లక్షలకు పడిపోయిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది లబ్ధిదారులకు తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

# తల్లికి వందనం కోసం లబ్ధిదారులు పాట్లు

### చెప్పులు అరిగేలా సచివాలయ, విద్యుత్ కార్యాలయాలకు పరుగులు





ఆలమూరు, పెన్ పవర్, జూన్ 17

ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లికి వందనం లబ్ధిదారులలో కొందరికే లబ్ధి చేకూరడంతో మిగిలినవారు స్థానిక సచివాలయాల్లో తమ అడ్డంకులను తెలుసుకుంటున్నారు. దీంతో సచివాలయ సిబ్బంది తెలుపుతున్న ఏకైక కారణం అధిక విద్యుత్ వినియోగం కారణంగా మీరు అర్హులు కాలేకపోయారని అంటున్నారు. దీనిపై వారు లబోదిబోమంటూ విద్యుత్ శాఖ అధికారులను ఆశ్రయించి తమ గోడు వెల్లబోసుకుంటున్నారు. అలాగే ప్రభుత్వం దీనిపై ఈనెల 20 లోపు సచివాలయాల్లో అర్హులంతా గ్రీవెన్స్ చేసుకోవాలని గడువు విధించింది. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయానికి పెద్ద ఎత్తున అమ్మకు వందనం బాధితులంతా క్యూ కట్టారు. అలాగే వారంతా విద్యుత్ శాఖ ఏఈ డి.ఎం.కె.ప్రసాద్ కు మా యొక్క పేరున ఉన్న విద్యుత్ మీటర్ల యాన్యువల్ రిపోర్ట్ తో సచివాలయంలో గ్రీవెన్స్ కు అప్లై చేసుకోవాలని అక్కడ ఉద్యోగులు తెలిపినట్లు వారు వివరించారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఆయన వ్యక్తిగత విద్యుత్ యూనిట్ల వినియోగ యాన్యువల్ బిల్లుల రిపోర్ట్ కొరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆ విధంగా చేసిన వారందరికీ వ్యక్తిగత యాన్యువల్ బిల్లులను అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ విద్యుత్ యూనిట్లు అధిక వినియోగం చేసినట్లుగాను ఆన్లైన్లో మా ఆధార్ తో చూపించడంతో అనర్హత వేటు వేశారన్నారు. నిజానికి వాటికి మాకు ఏ విధమైన సంబంధం లేదని ఇదంతా ఆన్లైన్ లో వేరే వారి మీటర్లు మా ఆధార్ కు అనుసంధానం చేశారని వారు వాపోయారు. ఇదిలా ఎవరు చేశారో ఎందుకు చేశారో మాకు అర్థం కావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా తప్పుడు సమాచారం మా పేరున నమోదు చేయడంతో మేమంతా కార్యాలయాలు చుట్టూ తిరిగి వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వస్తుందని ముక్తకంఠంగా ఘోషించారు. ఇంత గా చేసిన మేము లబ్ధిదారులము అవుతాము కాదో అని సందిగ్గత వారి వద్ద నుండి వ్యక్తం అయింది. ఇకనైనా ప్రభుత్వం వేగంగా స్పందించి ఇలాంటి వాటి నుండి అర్హులకు రక్షణ కల్పించి పునరావృతం కాకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ జూనియర్ ఇంజనీర్ లక్ష్మి, ఆపరేటర్ లక్ష్మి, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

# అభజాన్ భగీదరి అభియాన్ జన్‌మాన్ కార్యక్రమం

దేవీపట్నం,పెన్ పవర్,జూన్17:

మండలంలో శరభవరం,దేవారం గ్రామంలో దేవీపట్నం మండలం ఎంపీడీవో ఎస్ సాల్మన్ రాజ్ ఆధ్వర్యంలో దర్తీ అభజన భగీదరి అభియాన్ జన్ మాన్ కార్యక్రమం ప్రారంభించడం జరిగినది. గిరిజన మారుమూల గ్రామాలకు మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జాతీయ గ్రామ ఉత్కర్ష అభయం ద్వారా గిరిజనులకు అవగాహన కల్పించడం జరుగుతుందని అదేవిధంగా ఏజెన్సీలోనే ధర్తీ అభాజనా జాతీయ గ్రామీణ ఉత్కర్ష అభియాన్ పథకం అమలు చేయటానికి గ్రామంలో వివిధ సమస్యలను గుర్తించి గ్రామంలో వివిధ గిరిజన తెగలకు అవగాహన సదస్సు ద్వారా కల్పించి అర్హులైన లబ్ధిదారులకు ఆధార్ కార్డులు ఆయుష్మాన్ భారత్ కార్డు పీఎం ఆవాస్ యోజన పథకంలో పక్కా గృహాలు పాఠశాల నిర్మాణాలు ఏకలవ్య మోడల్ పాఠశాల నిర్మాణాలు వైద్య ఆరోగ్య సేవలు అందించే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలియజేశారు.ప్రధానమంత్రి జన్ మాన్ పథకం కింద ఆర్థిక చేకూర్పు కల్పించాలని గ్యాస్ కలెక్షన్ లేనివాళ్లు లబ్ధిదారులను గుర్తించి పీఎం ఉజ్వల్ పథకం ద్వారా గ్యాస్ కల్పన అందించడం జరుగుతుందని ప్రతి కుటుంబానికి బ్యాంక్ అకౌంట్ ప్రారంభించడం జరుగుతుందని డిఏ జోగా అవగాహన సదస్సు నిర్వహించారు.అదేవిధంగా త్రాగునీరు రహదారులు సౌకర్యాలు మౌలిక సదుపాయాలు పాఠశాలలు నిరుద్యోగ గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ భర్తీ ఆభజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సరభవరం దేవారం ఎంపీటీసీ తుర్రం జగదీష్ దొర, దేవారం సర్పంచ్ తుర్రం రమాదేవి, శరభవారం సర్పంచ్ కొమరం లక్ష్మి శ్రీనివాస్, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ విజయ శ్రీనివాస్, ఎం పి హెచ్ ఈ ఓ కోసు శ్రీనివాస్ దొర, దేవారంపంచాయతీ కార్యదర్శి బి రాంబాబు ఏటీఎం బత్తిన అప్పలకొండ హౌసింగ్ ఏఈవి. రాజు ఐసిడిఎస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.




### 63 మంది పేద విద్యార్థులను

# దత్తత తీసుకున్న మంత్రి సుభాష్





### పండుగలా మంత్రి సుభాష్ జన్మదిన వేడుకలు

కె గంగవరం పెన్ పవర్ జూన్ 17:

నా ఈజీవితం ప్రజా సేవకే అంకితం పాలకునిగా కాకుండా సేవకునిగా ప్రజలుకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని, పేదరికంపై నిరంతరం పోరాటం చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.మంగళవారం మంత్రి సుభాస్ జన్మదిన వేడుకలు వెంకటయపాలెంలోని పేపకాయల బాబ్జి కళ్యాణ మండపంలో పండుగలా నిర్వహించారు.రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున కూటమి పార్టీ నాయకులు,అధికారులు,కార్యకర్తలు,అభిమానులు తరలి వచ్చి అభినందనలు తెలియజేశారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద ఎత్తున తరలివచ్చి తన అభిమాన నాయకుడికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ తన పట్ల ప్రేమాభిమానాలు చూపించి శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి హోదా తనకు అలంకారం కాదని,ప్రజలకు సేవ చేసుకొనే గొప్ప అవకాశంగా భావిస్తున్నాను అన్నారు. పేదలకు సేవ చేసుకునే అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, ఒక ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు.రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు పి 4 కార్యక్రమం ప్రవేశ పెట్టిన సీఎం ఆశయం మేరకు 63 మంది పిల్లలను దత్తత తీసుకొని,ఉన్నత చదువులు చదివించి పేదరిక నిర్మూలనకు కృషి చేస్తానని నిండు సభలో ప్రకటించారు.పేదరికం వల్ల ఏ ఒక్కరు చదువు ఆగకూడదని, తన పిలుపుకు స్పందించి పేద విద్యార్థుల చదువు కోసం దాతలు రూ. 20 లక్షల రూపాయలు విరాళం అందించడం ఆనందకర మన్నారు. పేదరికం నిర్మూలన, నిరుద్యోగం నిర్మూలను, ఉపాధి కల్పన తన లక్ష్యమన్నారు. తన జన్మదిన పురస్కరించుకొని 63 మంది విద్యార్థులను దత్తత తీసుకొని వారికి ఉద్యోగం వచ్చేవరకు చదివిస్తామన్నారు. రామచంద్రపురం నియోజవర్గంలో హృదయ సంబంధిత హాస్పిటల్ నిర్మాణం కోసం ఉప్పు మిల్లి గ్రామానికి చెందిన యాళ్ల కుటుంబ సభ్యులు సుమారు 50 లక్షల విలువచేసే 50 సెంట్లు స్థలం దానం ఇవ్వడం సంతోషకరమన్నారు. అలాగే 8 మందికి బడ్డీ కొట్లు, ఇద్దరు నిరుపేదలకు ఇల్లు కట్టించే బాధ్యత, ఎనిమిదికి హార్ట్ ఆపరేషన్లు చేయించేందుకు నిర్ణయం తీసుకున్నాను అన్నారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకునేలా భవిష్యత్తు ప్రణాళిక చేపట్టానన్నారు. అలాగే రామచంద్రపురం శిరోముండనం బాధితుడుకి కుల సర్టిఫికెట్ ఇప్పించామని, అలాగే ఇల్లు కట్టించి ఇస్తామన్నారు. సిఎస్ఆర్ నిధులతో త్వరలో రామచంద్రపురంలో అత్యాధునిక సౌకర్యాలతో ఆసుపత్రి నిర్మాణం చేపడతామన్నారు. సమాజ సేవలో, సమాజ హితం కోరుతూ ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ప్రజా సేవకే తన జీవితం అంకితమని వెల్లడించారు. అనంతరం దత్తత తీసుకున్న పిల్లల సమక్షంలో మంత్రి సుభాష్ కేకు కోసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## “యోగాంధ్ర సరే నిరుద్యోగాంధ్ర సంగతి ఏంటి”

- యోగాసనాలు కాదు ఉద్యోగాలు ఇవ్వండి
- డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆసనాలతో యువత నిరసన



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జూన్ 17 :**డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో యువత యోగాస నాలు వేస్తూ మంగళవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. యోగా పేరిట ప్రభుత్వం మోడీ దగ్గర మెప్పు కోసం, గిన్నిస్ బుక్ రికార్డుల కోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తూ యువతను పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు యు ఎస్ ఎన్ రాజు మాట్లాడుతూ ఉద్యోగాలు లేక యువత నిరుద్యోగంతో బాధపడుతున్నారని అన్నారు. కొన్ని సంస్థలు చేసిన సర్వేలో సైతం కోట్లాదిమంది నిరుద్యోగు లుగా ఉన్నారని చెప్పారు. ఎన్నికల ముందు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు అని చెప్పి ఇప్పుడు ప్రభుత్వంలోకి వచ్చి ఎంతమందికి మోడీ ఉద్యోగాలు ఇచ్చారో లెక్క చెప్పాలని ప్రశ్నించారు. “యోగాంధ్ర సరే నిరుద్యోగాంధ్ర సంగతి ఏంటి” అని అడిగారు. ప్రశ్నించడమే తన పని అన్న పవన్ కళ్యాణ్ యువత ఉద్యోగాల కోసం పట్టించుకోకుండా ఉన్నారని విమర్శించారు. నిరుద్యోగం వలన అభివృద్ధి కొంటుపడే ప్రమాదం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షు లు సనపల శ్రావణ్ నాయకులు సంతోష్, చిన్న, సాధు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## దర్తి ఆబ్ జన్ భగీదారి పథకం గ్రామసభ నిర్వహణ.





**హుకుంపేట పెన్ పవర్ జూన్17** దర్తి ఆబ్ జన్ భగీదారి అభయం కార్యక్రమం కింద హుకుంపేట గ్రామ పంచాయతీ హుకుంపేట గ్రామం లో సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ ఆధ్వర్యంలో విజయవంతం గా జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ పూర్ణిమ మాట్లాడుతూ ప్రధాన మంత్రి జన్మన్ పథకం ద్వారా అందెటువంటి పి.వి.టి.జి కులస్తులు కు ఆర్థిక.సామర్థ్యంగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు ను కోరారు. అలాగే ఈ పథకం ద్వారా పి.వి.టి.జి. గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పనా కోసం అధికారులు చొరవ చూపాలి అని ఆమె అన్నారు గిరిజన లు అందరికి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, జాబ్ కార్డు వంటి గుర్తింపు పత్రాలు అందించేలా కృషి చేయాలని సూచించారు. ఈ గ్రామ సభ ద్వారా అందరికీ అందే సంక్షేమ పథకాలు పై అవగాహన కల్పించడం అలాగే ప్రతి పథకం ఫలాలను వారికి అందించడంలో ఇది ఒక సువర్ణ అవకాశమని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమ దేవి, ఈవోపీఆర్డి. పరమేష్,సెక్రటరీ సత్యనారాయణ, సిడిపిఓ సువర్ణ, ఏపీఎం అప్పయమ్మ హౌసింగ్ ఏఈ సచివాలయం సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, పేసా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జ్వర బాధితులు కచ్చితంగా రక్త పరీక్షలు చేయించుకోవాలి

- మలేరియా నిర్ధారణ జరిగితే క్రమంగా మందులు వాడాలి
- దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే హిమబిందు



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, జూన్ 17:**గిరిజన గ్రామాల్లో జ్వర బాధితులు కచ్చితంగా రక్త పరీక్షలు చేయించుకోవాలని ధారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. మంగళవారం మాదిగమల్లు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 97 మందికి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఐదుగురు జ్వర బాధితులకు రక్త పరీక్షను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. జ్వరం బాధితుల్లో మలేరియా నిర్ధారణ కాలేదు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో అపెడమిక్ సీజన్ ప్రారంభం కావడం వల్ల గ్రామాల్లో జ్వరాలు, అతిసారా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది అన్నారు.గిరిజనులకు వ్యాధి సోకిన వెంటనే ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. జ్వరాలపై నిర్లక్ష్యం చేయరాదని ఆమె సూచించారు. జ్వర బాధితులు రక్త పరీక్ష చేయించుకోవడం వల్ల సకాలంలో వ్యాధిని గుర్తించవచ్చునని ఆమె తెలిపారు. ప్రస్తుతం గిరిజన గ్రామాల్లో దోమల మందు పిచికారి జరుగుతుందని, ప్రతి గిరిజన కుటుంబం గృహంలో ఏసీఎం ఐదు శాతం మందుని పిచికారి చేసుకోవాలన్నారు. దోమల మందు రంగు, వాసన ఉండదని, కేవలం దోమలపైనే మాత్రమే ప్రభావం చూపుతుందని ఆమె తెలిపారు. గ్రామాల్లో గృహాలు, వీధులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె తెలిపారు. ఆదివాసీలు పసర మందులు, నాటు వైద్యానికి దూరంగా ఉండాలని తెలిపారు. గర్భిణీలు తరచూ వైద్య పరీక్షలు చేయించుకొని ఆసుపత్రిలోనే ప్రసవం పొందాలి అన్నారు. శిశువుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి.లోవ కుమారి, ఏఎన్ఎమ్ సీతమ్మ పాల్గొన్నారు.

# ప్రజలు, విద్యార్థుల తరలింపు, పార్కింగు, ట్రాఫిక్, పారిశుధ్యం పై సమీక్షా






- అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం,జూన్ 17 :** అధికారులు సమన్వయంతో పనిచేసి అంతర్జా తీయ యోగా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు పేర్కొన్నారు. మంగళవారం ఎ.యు. కన్వెన్షన్ సెంటరులో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ కేంద్రంలో యోగాంధ్ర విధుల ప్రత్యేక అధికారులు, పోలీ సు, వివిధ శాఖల అధికారులతో బస్సులు ఏర్పాటు, ప్రజలు, విద్యార్థుల తరలింపు, పార్కింగు, ట్రాఫిక్, పారిశుధ్యం తదితర ఏర్పా ట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ స మీక్షా సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు మాట్లాడుతూ కార్యక్రమానికి విచ్చేసే ప్రజలు, విద్యార్థులను జాగ్రత్తగా తీసుకువచ్చుట, ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా కేటాయించిన స్థలాలకు చేర్చుట, తిరిగి క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేర్చుట లక్ష్యంగా పెట్టుకొని అధికారులు సమన్వయం తో పనిచేయాలని తెలిపారు. విజయనగరం, శ్రీకాకుళం, పాడేరు, అనకాపల్లి జిల్లాల నుండి వచ్చే ప్రజలను వారికి కేటాయించిన బ్లాకులకు నేరుగా తరలించాలన్నారు. వారికి కేటాయించి న బ్లాకులకు సంబంధించిన సమాచారం, పార్కింగు వివరాలను సంబంధిత సిబ్బందికి ముందుగానే తెలియజేయాలన్నారు. పార్కింగు ప్రదేశాలలో మైక్, లైటింగు ఏర్పాటు చేయాలని, రెవెన్యూ, పోలీసు, ఆర్.టి.సి., రవాణా శాఖ సిబ్బందిని నియమించాలన్నారు. ప్రతి బస్సుపై సంబంధిత సచివాలయం వివరాలను తెలియ జేస్తూ బ్యానరు ఏర్పాటు చేయాలని తెలిపారు. యోగా చేసే ప్రతి కంపార్టుమెంటుకు టాయిలె ట్స్ ఏర్పాటు చేయాలన్నారు. యోగా నిర్వహిం చే ప్రదేశాలకు దగ్గరలో గల పబ్లిక్ టాయిలెట్స్, వివిధ హెటల్, రెస్టారెంట్స్ చెందిన టాయిలెట్స్ ప్రజలు వినియోగించుకొనుటకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమం నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా డ్రైవర్లు అప్రమత్తగా ఉండాలని, జాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రజలను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. వాహనాల రాకపోకల పర్యవేక్షణ, వాహనాల మెయింటె నెన్స్ కు సంబంధించి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు సరఫరా చేయాలని, టాయిలెట్స్, పారిశుధ్యం సక్రమంగా నిర్వహించాలని చెప్పారు.

## 150 మంది వైసిపి నాయకులు జనసేనపార్టీ లో చేరిక



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్ 17 :**విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే మరియు జనసేన పార్టీ నగర అధ్యక్షులు అయిన లివంశీ కృష్ణ శ్రీనివాస్ సమక్షంలో 36 వార్డ్ కార్పొరేటర్ మాసిపోగు మేరిజొన్స్, మాసిపోగు రాజు గారి ఆధ్వర్యంలో 36వ వార్డ్ కు చెందిన వైఎస్ఆర్సి పి జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ కుందేటి సుధాకర్, శ్రీ విగ్నేశ్వర స్వామీ టెంపుల్ చైర్మన్ కె.వి. నరసింగరావు,వార్డ్ బిసి సెల్ ప్రసిడెంట్ చల్లపల్లి కుంచెయ్య, సత్యనారాయణ స్వామీ ట్రస్ట్ బోర్డు మెంబెర్ రమణి, వార్డ్ సచివాలయ కన్వీనర్ జగన్మోహనరావు, వడ్డాది విజయలక్ష్మి, సవరపు రాజు, కొల్లి చిన్న, వంగళపూడి శ్రీనివా సరావు, కేబుల్ కుమార్, అప్పారావు, అప్పల రాజు, శైల భాను, కనకమహాలక్ష్మి, దేవి, శ్యామ ల,అలాగే 36 వార్డ్ %ఎంతీఎజూ% బూత్ ప్రసిడెంట్స్, బూత్ కన్వీనర్స్ మొదలగువారు సుమారు 150 మంది సీతంపేటలో గల జనసేనపార్టీ నగర కార్యాలయం నందు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు,ఈ సందర్భంగా కార్పొరేటర్ మేరి జోన్స్ మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ చేసే అభివృద్ధి పనులకు, సేవ కార్యక్రమాలకు, ప్రజలనుండి స్వచ్ఛందంగా ఈ జనసేనపార్టీ లో జాయిన్ అయ్యారన్నారు,

అనంతరం ఎమ్మెల్యే వంశీ కృష్ణ మాట్లాడుతూ పార్టీలో జాయిన్ అయినవారందరికి ధన్యవా దములు తెలియచేసారు, భవిష్యత్తు లో దక్షిణ నియోజకవర్గం లో మరిన్ని అభివృద్ధి పనులు, సేవ కార్యక్రమాలకు చెప్పడతాము అని అన్నా రు, భవిష్యత్తు లో సౌత్ నియోజకవర్గాన్ని మో డల్ నియోజకవర్గం గా తీర్చిదిద్దుతానన్నారు,

ఈ కార్యక్రమం లో 36 వ వార్డ్ జనసేన అధ్యక్షు లు పడమటి శ్రీనివాస్, జనసేన నాయకులు కోన నవీన్ కుమార్, పరశురామ్, శ్రీధర్, పరమే ష్, రాజ్ కుమార్, వీరయ్య మరియు జనసైనికు లు, వీరామహిళలు పాల్గొన్నారు.



## ఆరోగ్య విశాఖ ఆవిర్భావమే లక్ష్యంగా యో గాంధ్ర



నగర మేయర్ పీలా శ్రీనివాసరావు .

**విశాఖ దక్షిణం,పెన్ పవర్ జూన్ 17 :** ఆరోగ్య విశాఖ అవిర్భావమే లక్ష్యంగా యో గాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. మంగళ వారం ఆయన ముఖ్య అతిథిగా జీవీఎంసీ జోన్-3 పరిధి ఎంవిపి కాలనీలోని ఎస్3 స్పోర్ట్స్ ఎరీనా లో జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ కార్యక్రమానికి జీవీఎంసీ డిప్యూటీ మేయ ర్ దల్లి గోవిందరాజు, మాజీ శాసనమం దలి సభ్యులు పివిఎన్ మాధవ్ ,జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి తో కలసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నగర మేయ ర్ మాట్లాడుతూ యోగాంధ్ర ధ్యేయంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రమంతటా యోగాంధ్ర కార్యక్ర మాలను నెలరోజులనుండి నిర్వహిస్తుంద ని ,ఆరోగ్య విశాఖే లక్ష్యంగా విశాఖ నగరంలో నిత్యం యోగాభ్యాస కార్యక్రమాలు జరుగుచు న్న నేపథ్యంలో జీవీఎంసీ యంత్రాంగం యోగ కార్యక్రమాలు నిర్వహించడం అందరికీ స్ఫూర్తి దాయకమని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు .యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవ చ్చునని, ప్రతి ఒక్కరూ నిత్యం యోగాసనాలు యోగా చార్యుల పర్యవేక్షణలో సాధన చేయాల న్నారు. భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ యోగా ను ప్రపంచ దేశాలకు పరిచయం చేసి పది సంవత్సరాలు పూర్తయి 11వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా జూన్ 21న విశాఖ వేదికగా 5 లక్షల మంది భాగస్వామ్యం తో ప్రపంచ స్థాయి రికార్డును విశాఖ నగరం దక్కించుకోనున్నదన్నారు. విశాఖ కీర్తిని ప్రపం చానికే తెలిసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లో రెండు కోట్ల మంది ప్రజలు యోగ క్రియల్లో పాల్గొనేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. విశాఖ నగర కార్పొరేటర్లు, జీవీఎంసీ అధికారులు, ఉద్యోగు లు యోగ కార్యక్రమాలు నిర్వహిస్తూ విశాఖ నగర ప్రజలను పెద్ద ఎత్తున పాల్గొనేలా స్ఫూర్తి నిస్తున్నారన్నారు. ప్రతి ఒకరు తమ పిల్లలను విద్యార్థి దశ నుంచే యోగ సాధన చేసేలా కృషి చేయాలని మేయర్ పేర్కొన్నారు.

అనంతరం డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగ కార్యక్రమాలు విశాఖలో నిర్వహించడం విశాఖ ప్రజలకే గర్వకారణమని భారత ప్రధాని సహకారంతో కూటమి ప్రభుత్వం విశాఖ వేదికగా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నందున రాష్ట్రంలోనే రెండు కోట్ల జనాభాతో పాటు విశాఖ నగరంలో ఐదు లక్షల మంది ప్రజలు ఈ యోగా కార్యక్రమాల్లో నేరుగా పాల్గొంటున్నందు కు ఎంతోఆనందదాయకమన్నారు.ప్రజలందరూ ఈ యోగాను నిత్య క్రియగా భావించి ప్రతిరోజు యోగ సాధన చేయాలని తెలిపారు.తదుపరి మాజీ శాసనమండలి సభ్యులు పి.వి.ఎన్ మాధవ్ మాట్లాడుతూ విశాఖ వేదికగా జూన్ 21న నిర్వహిస్తున్న యోగ కార్యక్రమం ద్వారా విశాఖ ప్రపంచ కీర్తిని చాటి చెప్పే సదావకాశం మనకు దక్కడం గర్వకారణమని పేర్కొన్నారు. యోగాచార్యులు ఈ కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్లు, జీవీఎంసీ అధికారులు ఉద్యోగులు అందరితో యోగ క్రియలను చేయించిన అనంత రం శాసనమండలి సభ్యులు అందరితో యోగా సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పి.ఉషాశ్రీ , గొల గాని వీరారావు, బిపిన్ కుమార్ జైన్ జీవీఎం సీ కార్యదర్శి బి.వి రమణ, జోనల్ కమిషనర్లు కె.శివప్రసాద్, రాము, ఇప్పి నాయుడు, కనకమ హాలక్ష్మి, మల్లయ్య నాయుడు, హేమావతి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) డి.లక్ష్మి, డిపిఓలు ఏపీడి లు, జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## యోగా శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని పెంచుతుంది

- అంతర్జాతీయ దినోత్సవం ముందు డివిజన్‌లో యోగా సెషన్లను నిర్వహిస్తుంది



**స్టాఫ్ రిపోర్టర్,పెన్ పవర్,విశాఖపట్నం, జూన్17 :**
వాల్టెయిర్ డివిజన్ యోగా 2025 యొక్క అంతర్జాతీయ దినోత్సవం ముందు డివిజన్‌లో యోగా సెషన్లను నిర్వహిస్తుంది ఈస్ట్ కోస్ట్ రైల్వే యొక్క వాల్టెయిర్ డివిజన్, యోగా 2025 యొక్క అంతర్జాతీయ దినోత్సవం, రైల్వే ఉద్యో గులు మరియు వారి కుటుంబ సభ్యులలో శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్స హించడానికి డివిజన్ ద్వారా రైల్వే స్టేషన్లలో యోగా సెషన్లను నిర్వహిస్తుంది. వాల్టెయిర్ డివిజన్ యోగా యొక్క సంఘటనల శ్రేణిగా జూన్ 16 నుండి జూన్ 19 వరకు మరి యు జూన్ 21 న ప్రధాన రైల్వే స్టేషన్లలో విశాఖప ట్నం, విజియానగరం, విజియానగరం, శ్రీకాకు ళం, అరాకు, రాయగడ, వారి కుటుంబ సభ్యులు, క్రెస్తవంగా పాల్గొనడం ద్వారా, శ్రీకాకుళం, అరాకు, రాయగడ, జగ్‌దాల్పూర్ నేవీ సిబ్బంది మొదలైనవి.యోగా శిబిరంలో, అనుభవజ్ఞులైన యోగా బోధకులు వివిధ రకాల యోగా ఆసనాలు, ప్రాణయం మరియు ధ్యాన పద్ధతులను బోధిస్తున్నారు. డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీ లలిత్ బోహ్రా మార్గదర్శకత్వంలో, డివిజన్ యొక్క నామినేటెడ్ స్టేషన్లలో రైల్వే అధికారులు మరియు సిబ్బంది ఉత్సాహంగా మంచి సంఖ్యలో పాల్గొంటున్నారు. జూన్ 21, 2025 న, అంతర్జాతీయ యోగా రోజున, వాల్టె యిర్ డివిజన్ వాల్టెయిర్ రైల్వే క్రికెట్ స్టేడి యంలో యోగా సెషన్ నిర్వహిస్తుంది.

ఈ సందర్భంగా డాక్టర్ లైట్ బోహ్రా మాట్లాడు తూ, రోజువారీ అలవాటులో భాగంగా యోగా ను చైల్డ్ హుడ్ నుండి ప్రేరేపించాలని మరియు ఆరోగ్యకరమైన అభ్యాసాన్ని అనుసరించడానికి పౌరుగువారిలో అవగాహన కల్పించాలని అన్నారు. కండరాల వశ్యత, మానసిక బలం, శరీర సమతుల్యత మరియు ఆందోళన మరి యు ఒత్తిడిని తగ్గించడం ద్వారా యోగా శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని పెంచుతుందని ఆయన అన్నారు. ఇది రోగనిరోధక శక్తిని పెంచు తుంది మరియు శక్తి స్థాయిలు మరియు సాను కూల వైఖరిని పెంచడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

## ఎమ్మెల్యే ను.కలిసిన జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు.



**గుమ్మలక్ష్మీపురం జూన్ 17. పెన్ పవర్.** మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి ని మంగళవారం నాడు మన్యం జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మహిళా సంఘాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే ను కోరారు.ఆమె సానుకూలంగా స్పందించి మహిళల అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహాయం ఉంటుందని ఈ సందర్భంగా ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య ప్రెసిడెంట్ కె.లలితకుమారి, సెక్రెటరీ సుబ్బలక్ష్మి, ట్రెజరర్ పి.రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు





**గోపాలపట్నం, పెన్ పవర్, జూన్ 17 :** జీవీఎంసీ 92వ వార్డు, గోపాలపట్నం, ఇంద్రానగర్లో వెలిసిన శ్రీ మోదకొండమ్మ అమ్మవారి పండుగ సందర్భంగా ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పెతకం శెట్టి గణబాబు ఆలయాన్ని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షునిగా జీలకర్ర నాగేంద్ర





**గాజువాక పెన్ పవర్ జూన్ 17:**వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షునిగా జీలకర్ర నాగేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. తనపై నమ్మకంతో ప్రచార విభాగం జిల్లా అధ్యక్షునిగా నియమించిన మాజీ ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షులు6 వైయస్ జగన్మోహన్ రెడ్డి, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, జిల్లా అధ్యక్షులు కెకె రాజు, శాసనమండలి సభ్యురాలు వరుదు కళ్యాణి, మాజీ శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి, గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

జీలకర్ర నాగేంద్ర 2007 నుండి 2010 వరకు ఎన్.ఎస్.యూ.ఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేశారు, ఆ సమయంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని విశాఖలో పాదయాత్ర చేశారు. 2009లో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి మరణాంతరం ఎన్.ఎస్.యూ.ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేసి వైయస్ జగన్మోహన్ రెడ్డితో పయనించారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం తరువాత వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షునిగా, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2014, 2019, 2024 ఎన్నికల్లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషిచేశారు.

## నేత్రపర్వంగా శ్రీ స్వామివారి గరుడసేవ



**సింహాచలం, పెన్ పవర్, జూన్ 17 :** శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామివారి గరుడసేవ నేత్రపర్వంగా సాగింది. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని మండపంలో అధిష్టింపజేశారు. పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో కార్యక్రమానికి కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

## అంగరంగ వైభముగా స్వామివారి నిత్య కల్యాణం





**సింహాచలం, పెన్ పవర్, జూన్ 17 :** ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

## యోగాసనాల సాధన చేస్తున్న దేవాలయ సిబ్బంది, వేద విద్యార్థులు





**సింహాచలం, పెన్ పవర్, జూన్ 17 :** శ్రీ వరహాలక్ష్మీ నరసింహస్వామివారి దేవస్థానం, సింహాచలంలో ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం, మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో సాగర తీరాన దాదాపు 5 లక్షల మందితో యోగా మహోత్సవాన్ని విశాఖ వేదికగా నిర్వహించబోనున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహాలలో భాగంగా మంగళవారం సింహాచలం, దేవస్థానం అనుబంధ సంస్థలైన విద్యాలయాల వేద విద్యార్థులతో కలిసి దేవస్థానం ఉద్యోగులు, అధికారులు యోగా సాధన నిర్వహించారు. దేవస్థానం పరిపాలన భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనుభవజ్ఞులైన శిక్షకుల నేతృత్వంలో ధ్యాన పద్ధతులతో ప్రాణాయామం, తదితర యోగాసనాలు వేశారు. యోగా వలన కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి సుమారు 500 మందితో బుధవారం కొండపైన గాలి గోపురం ఎదురుగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈవో వెంద్ర త్రినాధరావు తెలిపారు.

## పరదేశమ్మ అమ్మవారిని దర్శించుకున్న డికే ఫౌండేషన్ చైర్మన్ దొడ్డి కిరణ్



**గోపాలపట్నం, పెన్ పవర్, జూన్ 17 :** పశ్చిమ నియోజకవర్గం, జీవీఎంసీ 89 వ వార్డు, చంద్రనగర్ గ్రామదేవత పరదేశి అమ్మవారు పండగ సందర్భంగా డికే ఫౌండేషన్ చైర్మన్ మరియు విశాఖ జిల్లా వై. ఎస్.ఆర్.సీ.పి వైఎస్సీపీ స్టేట్ యువజన విభాగ జనరల్ సెక్రటరీ, అద్యక్షులు దొడ్డి కిరణ్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పరదేశమ్మవారిని ఆశీస్సులు అందరికి ఉండాలని కోరుకున్నారు . ఈ కార్యక్రమాలో పలుగునా యానపు వెంకట్రం, కాండ్రేగుల త్రినాథ్, అప్పారావు, శంకర్రావు, పి.విజయ్ ఆటో ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మోదకొండమ్మని దర్శించుకున్న బెహరా భాస్కరరావు





**గోపాలపట్నం, పెన్ పవర్, జూన్ 17 :** జీవీఎంసీ 92వ వార్డు, ఇందిరానగర్ లో శ్రీ మోదకొండమ్మ అమ్మవారి పండుగ మహోత్సవము సందర్భంగా బెహరా భాస్కర రావు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు జయశంకర్, సెక్రెటరీ కుమార్, కడిమి రామకృష్ణ, మార్కండేయ రాజశేఖర్, తులసిరావు, నూకరాజు, అరుణ్ కుమార్, రెడ్డి నాయుడు, సాయి, దాసరి శ్రీను, లతీఫ్, సూరి, ప్రకాష్, త్రినాధ్, హరీష్, చక్రి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రబాబు పాలన మోసం.. జగన్ పాలన నమ్మకం: అరకు వైఎస్సార్సీపీ నేతల ఆరోపణలు



**హుకుంపేట, పెన్ పవర్ జూన్ 17:**"వైయస్ జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం" అనే పేరుతో రూపొందించిన పుస్తకాన్ని హుకుంపేట మండల కేంద్రంలో వైఎస్సార్సీపీ నేతలు ఆవిష్కరించారు. అరకు నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం మంగళవారం నిర్వహించగా, నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హుకుంపేట మండల వైఎస్సార్సీపీ నేతలు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజలకు మోసం జరిగిన దుఃఖదినంగా భావిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు, లోకేష్లు రెడ్బుక్ పాలన పేరుతో రాష్ట్రాన్ని చీకటి గుహలోకి నెట్టారని విమర్శించారు.

"సుపరిపాలన కాదు... సూపర్ సిక్స్ పేరుతో నవరత్నాలను పునాదులు లేకుండా తొలగించారు. జగన్ పాలనలో ప్రజలకు నమ్మకమే లభించింది. అమ్మఒడి వంటి ప్రజా సంక్షేమ పథకాలతో సామాన్యుల భవిష్యత్తు పరిరక్షించబడ్డది. కానీ అదే పథకాలను కులపక్ష పాలకులు నిర్లక్ష్యం చేశారు" అని మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా వైఎస్సార్సీపీ జనరల్ సెక్రటరీ గండేరు చిన్నసత్యం, అరకు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు, హుకుంపేట సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, సుకూరు సర్పంచ్ దసాని సత్యవతి, కొంతిలి సర్పంచ్ రేగం రమేష్, మొట్టుజోరు సర్పంచ్ సిదరి సొంబ, సంతరి సర్పంచ్ పాడి అప్పలనాయుడు, తడిగిరి ఎంపీటీసీ భీమలింగేష్, మాజీ సర్పంచ్ బొంజుబాబు, ఉపాధ్యక్షులు వెంకటరావు, కిల్లో రామకృష్ణ, నాయకులు సాలమాన్, జంబు వెంకటేష్, కర్రన్న ఎగ్జిక్యూటివ్ వండలి నాగేష్, శివాజీ, గడ్డంగి సూరిబాబు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం జగన్ మోహన్ రెడ్డి చేసిన సేవలను గుర్తు చేస్తూ... మళ్లీ ఆయనను అధికారంలోకి తీసుకురావాలన్న సంకల్పాన్ని ఈ సందర్భంగా నేతలు పునరుద్ఘాటించారు.

## పర్యావరణ పరిర క్షణ అవగాహన ర్యాలీ



**ములగాడ, పెన్ పవర్, జూన్ 17 :**పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మల్కాపురంలోని సెయింట్ జోసెఫ్స్ హైస్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణ పరిర క్షణ అవగాహన ర్యాలీలో ఆమె ముఖ్య వక్తగా ప్రసంగిస్తూ - జనాభా, విద్యుత్ వినియోగం, ప్లాస్టిక్ వినియోగం పెరగడం వల్ల, అపార్ట్మెంట్లు నిర్మించడం వల్ల,పారిశ్రామికీకరణ వల్ల పర్యా వరణం తీవ్రంగా దెబ్బతింటోందని అన్నారు. పర్యావరణాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా పెంచాలని, ప్రజారవాణా వ్యవస్థను ఉపయోగించాలని, ప్లాస్టిక్ వాడ కాన్ని కనీస స్థాయికి తగ్గించాలని అన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ అని చెరియన్ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ- సహజ వనరులను కాపాడాలని, బాధ్యతా యుతంగా వ్యవహరించాలని అన్నారు. ర్యాలీ మల్కాపురంలోని సెయింట్ జోసెఫ్స్ స్కూల్ నుండి జవహర్ నగర్ , ఉడా కాలనీల మీదుగా కోరమండల్ గేటు వద్ద గల పార్కుకు చేరు కుంది. దారి పొడవునా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై నినాదాలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు , విద్యార్థులు జాతీయ సేవా పథక కార్యకర్తలు, స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు.

ఈ ర్యాలీలో భాగంగా విద్యార్థులు సెయింట్ జోసెఫ్ స్కూల్ ప్రాంగణంలో మరియు సెయింట్ ఆన్స్ కాలేజీ ప్రాంగణంలోమొక్కలను నాటారు.ల

## జన్మదినాన్ని పురస్కరించుకొని రోగులకు, చిన్నపిల్లలకు పండ్లు, రొట్టెలు పంపిణీ

- జనసేన నాయకులు గొర్లె వీర వెంకట్





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూన్ 17:**అరకు పార్లమెంట్ జనసేన పార్టీ ఎగ్జిక్యూటివ్ నెంబర్, కోర్ కమిటీ సభ్యులు గొర్లె వీర వెంకట్ జన్మదినాన్ని పురస్కరించుకొని, మండల కేంద్రంలో వీర వెంకట్ గూడెం కొత్త వీధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సామాజిక సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రోగులకు మరియు చిన్న పిల్లలకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వీర వెంకట్ కుటుంబ సభ్యులు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ముక్కలి రమేష్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు కొయ్యం బాలరాజు, జీకే వీధి పంచాయతీ జనసేన పార్టీ అధ్యక్షులు గడుతూరి పరమేష్, జనసేన సోషల్ మీడియా అధ్యక్షులు సురకత్తి నాగేశ్వరరావు, వైద్యులు డాక్టర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా వీర వెంకట్ సామాజిక బాధ్యతను చాటిచెప్పినట్లు పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

## జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం

- వైసిపి ప్రభుత్వ హాయంలో శాంతి, సుస్థిరత, పటిష్టంగా అండ్ ఆర్డర్.
- కూటమి ప్రభుత్వ హాయంలో అశాంతి, అరాచకం, అటవీక పాలన, క్షీణించిన లా అండ్ ఆర్డర్.
- కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదు.
- కూటమి ప్రభుత్వం ఐదు కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడుస్తుంది.
- ఉమ్మడి విశాఖ జిల్లాల జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర.







**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 17.** రాష్ట్రంలో ఉన్న ఐదు కోట్ల మంది ప్రజలకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు అనీ, "జగన్ అంటే నమ్మకం - చంద్రబాబు అంటే మోసం" అనే పుస్తకాన్ని ఉమ్మడి విశాఖ జిల్లా చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర మంగళవారం ఆవిష్కరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, ముంచంగిపుట్టు మండల కేంద్రంలో గల పార్టీ కార్యాలయంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో "కూటమి ప్రభుత్వం ఐదు కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు" అనే కార్యక్రమాన్ని వైసిపి ముంచంగిపుట్టు మండల అధ్యక్షుడు పాంగి పద్మరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ.. "జగన్ అంటే ఓ నమ్మకం అని, చంద్రబాబు అంటే మోసం" అన్నారు. వైసిపి ప్రభుత్వ హాయంలో శాంతి, సుస్థిరతతో పాటు లా అండ్ ఆర్డర్ పటిష్టంగా అమలైందని, నేటి కూటమి ప్రభుత్వంలో ఆశాంతి, అరాచకం, అటవీక పాలన, రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతుందన్నారు. వైసిపి ప్రభుత్వ హాయంలో కుల,మత వర్గ బేదాలు లేకుండా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందించమన్నారు. వైసిపి ప్రభుత్వ హాయంలో గ్రామ స్వరాజ్యం, అధికార వికేంద్రీకరణ ఇంటింటికి సేవలు, విద్యా వైద్యం వ్యవసాయం మహిళల అభ్యుదయనీకి పెద్దపీట వేశామన్నారు. నేటి కూటమి ప్రభుత్వంలో అన్యాయాలు, అబద్ధాలు, విష ప్రచారాలు, దుర్మార్గాలు, వివక్ష, అంతులేని అవినీతి రాజ్యమేలుతుందన్నారు. విద్య వైద్యం వ్యవసాయం ఘోరంగా ఉందని, ఉన్మధ రాజకీయాలు చేస్తున్నారని ప్రభుత్వంపై మండిపడ్డారు. తల్లికి వందనం పథకంలో అర్హులైన లబ్ధిదారులను విస్మరించిందని, అనేక కారణాలతో అర్హులను కూడ తల్లికి వందనం పథకం వర్తించకుండా చేసిందని ప్రభుత్వంపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదని, ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే మహిళల పట్ల అరాచకం జరుగుతుందని, మహిళలు, బాలికలపై ఆఘాయిత్యాలు, వేధింపులు పెరిగాయి అన్నారు. వైసిపి హయంలో రేషన్ ఇంటింటికి అందించే వారని, నేడు రేషన్ లబ్ధిదారులకు రేషన్ డిపోలకు పంపించి తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో కొందరికి మాత్రమే లబ్ధి చేకూరుతుందని, సాదరణ ప్రజలకు న్యాయం జరగలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నిధులను, రాష్ట్ర ప్రభుత్వం తానే చేస్తున్నట్లు చెప్పుకుంటున్నారని, వైసిపి హాయంలోనే అభివృద్ధి సంక్షేమానికి పునాది వేశామన్నారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర సంక్షేమానికి, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపామని, ప్రస్తుతం అల్లూరి జిల్లాలో ఆ నిధులతోనే అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. వైసిపి కంచుకోటగా ఉన్న అల్లూరి జిల్లాను భవిష్యత్తులోనూ జరుగు అన్ని ఎన్నికల్లో విజయ కేతనం ఎగురవేస్తామన్నారు. వైసిపి జిల్లా కోఆర్డినేటర్ అరబీరు జగబంధు, వైసిపి నేతలు అర్జున్, రామమూర్తి, సర్పంచులు మండి బాబురావు, వెంగడ రమేష్ లు మాట్లాడుతూ.. తల్లికి వందనం పథకంలో లబ్ధిదారులకు వివిధ కారణాలతో అర్హులను అనర్హులుగా ప్రభుత్వం ప్రకటించిందని దీంతో లబ్ధిదారులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు అన్నారు. భూములు లేని వారికి భూములు ఉన్నట్లు, ఉద్యోగం లేని వారికి ఉద్యోగం ఉన్నట్లు తప్పుడు నివేదిక సృష్టించి అర్హులను ప్రభుత్వం విస్మరించిందని ప్రభుత్వం పై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో సర్పంచులకు విలువలేదని, నిధులు కొరతతో అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని, ప్రజల పక్షాన పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మండలం నుండి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా జడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్రకు పంపాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని పార్టీ శ్రేణులకు సర్పంచ్ రమేష్ పిలుపునిచ్చారు. తల్లికి వందనం అనే పేరు మార్చి కూటమి ప్రభుత్వం పిలిచినప్పటికీ ప్రజలు అమ్మ ఒడి అని చెప్పటం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎటువంటి అర్హత లేని కూటమి నాయకులు అజమాయిషీ చలాయిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని, పంచాయతీలలో పంచాయతీ సర్పంచులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిందే అనీ పెదగూడ సర్పంచ్ బాబురావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సీతమ్మ, వైసిపి నేతలు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, సోషల్ మీడియా కన్వీనర్స్, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఏనుగు బైలు, పెంట్ల గడ్డ గ్రామాలలో దర్తి అబ జన్ బగీదరి అభియాన్ కార్యక్రమం







● ప్రజలకు అవగాహన కల్పించిన అధికారులు

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూన్ 17:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దారకొండ పంచాయతీలో స్థానిక సర్పంచ్ నడిగట్ల రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారి గృహ నిర్మాణ శాఖ ఏఈ సెగ్గే సూరిబాబు పర్యవేక్షణలో జన జాతీయ గౌరవ వర్ష్ వేడుకలలో భాగంగా దర్తి అబ జన్ బగీదరి అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు.ప్రతి ఆదివాసీ కుటుంబానికి పక్కా ఇల్లు, తాగునీటి సరఫరా, విద్యుత్, మరియు ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యం. ఆర్థిక స్వావలంబన: కౌశల అభివృద్ధి, స్వరాజ్య ఉపాధి అవకాశాలు, మరియు వ్యవసాయ సహాయం ద్వారా ఆదివాసీ కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడం. విద్య %ఁ% ఆరోగ్యం: ఆదివాసీ విద్యార్థులకు గుణాత్మక విద్య, స్కాలర్‌షిప్‌లు, మరియు ఆరోగ్య సేవలు అందించడం. మౌలిక సదుపాయాలు: ఆదివాసీ గ్రామాలకు పక్కా రోడ్లు, మొబైల్ కనెక్టివిటీ, మరియు ఆరోగ్య, పోషణ, మరియు విద్యా మౌలిక సదుపాయాలు అందించడం కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సిహెచ్ రాజ్యలక్ష్మి, కూటమి నాయకులు కృష్ణ రావు, గోవిందరాజు, ఆశ అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## యోగాంధ్ర విజయవంతం చేయడంలో యంత్రాంగమంతా కష్టపడి పనిచేయాలని
## యోగాంధ్ర కార్యక్రమాన్ని ఒక పండగలా నిర్వహించుకోవాలి







దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్ 17** :అంకోసా ఫంక్షన్ హాల్ లో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఇన్చార్జి మంత్రి బాల ఆంజనేయ స్వామి, విశాఖ లోకసభ ఎం.పీ భరత్, టిడిపి ఇన్చార్జ్ సుధాకర్ , జనసేన పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివ ప్రసాద్ రెడ్డి ,బిజెపి విజయానంద రెడ్డి , ప్రకాశ్ రెడ్డి సమావేశంలో అధిక సంఖ్యలో పాల్గొన్న టిడిపి, బిజెపి ,జనసేన పార్టీ శ్రేణులు, పలు శాఖల సిబ్బంది అంతర్జాతీయ యోగా దినోత్సవం లో దక్షిణ నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకో వాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అంకోసా కల్యాణ మండపంలో జరిగిన ముఖ్య సమావే శంలో పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ గారి పాల్గొనే ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా, చరిత్రలో నిలిచిపోయే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ఒక పండగలా జరుపుకో వాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. టిడిపి ,బీజేపీ, జనసేన శ్రేణులతో మరియు వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన ఈ సమావేశంలో బాధ్యతగా ప్రతి ఒక్కరూ జనాన్ని తరలించి చరిత్రలో విశాఖ నగరం నిలిచే విధం గా కృషి చేయుటలో కీలక పాత్ర వహించాలని వంశీకృష్ణ గారు తెలిపారు. యోగాంధ్ర కార్యక్ర మంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి కూడా బస్సు సదుపాయంతో పాటు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పిస్తామని తెలియ జేశారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , రాష్ట్ర మంత్రి నారా లోకేష్ మరియు మంత్రి వర్గం ఎంతో కృషి చేస్తుందని, యోగాంధ్ర విజయవంతం చేయడం లో యంత్రాంగమంతా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.దక్షిణ నియోజకవర్గం లో 37,500 మందికి తగిన బస్సు సదుపాయం, ఆటో సదుపాయం కల్పించడంతోపాటు స్థానిక సచివాలయం సిబ్బంది, ఇంచార్జిలు అందుబా టులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. సమయానికి ప్రతి ఒక్కరూ కేటా యించిన స్థానానికి చేరుకునేలా చూడాలని తెలిపారు. 27 వార్డు ఉడా పార్క్ ఈస్ట్ పాయిం ట్ కాలనీ, కురుపాం సర్కిల్, 29 వార్డ్ ఎంజీ ఎం పార్కు, 30 వార్డ్ వాసవాని పాలెం, అప్పు గర్, 31 వ వార్డు ఎంజీఎం పార్కు, ఉడా పార్క్, సాగర్ నగర్, 32వ ఎంజిఎం పార్క్ , 33వ వార్డు సాగర్ నగర్, ఉడా పార్కు 34 సాగర్ నగర్ ఉడా పార్క్, 35వ వార్డు సాగర్ నగర్ జంక్షన్, 36వ వార్డు అప్పుగర్ , 37వ వార్డు సాగర్ నగర్ అప్పుగర్ , 38 వార్డు సాగర్ నగర్ ,అప్పుగర్, 39వ సాగర్ నగర్ 41 ఋషి కొండ ప్రాంతాలకు కేటాయించడం జరిగిందని తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్చార్జి మంత్రి బాలాంజనేయులు , లోక్ సభ ఎంపీ. భరత్ గారు, దక్షిణ టిడిపి ఇన్చార్జ్ సుధాకర్, జనసేన పార్టీ టెక్స్ యోజన పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివ ప్రసాద్ రెడ్డి, బిజెపి పెద్దలు విజయనందర్ రెడ్డి గారు ,ప్రకాష్ రెడ్డి మరియు వివిధ వార్డులు కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులు, జోనల్ కమిష నర్ మల్లయ్య నాయుడు, ఏపీడి పద్మావతి, సి ఓ లు, ఆర్ పి లు ఇతర సిబ్బంది,అధిక సంఖ్య లో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు..

## ఇది ప్రజాస్వామ్యమా..? రెడ్ బుక్ రాజ్యాంగమా?

**చిత్తూరు: పెన్ పవర్, జూన్ 17** చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో మహిళను చెట్టుకు కట్టేసి కొట్టారంటే ఇది ప్రజాస్వామ్యమా లేక రెడ్ బుక్ రాజ్యాంగమా అని వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కే రోజా మండిపడ్డారు. , ఏ రాష్ట్రంలోనైనా ఇలా జరుగుతుందా, ఒక మహిళను చెట్టుకు కట్టేసి కొట్టడం ఎక్కడైనా చూశామా అని ప్రశ్నించారు. టీడీపీ నాయకుడే మహిళను చెట్టుకు కట్టేసి కొట్టడం అత్యంత దారుణమన్నారు. కుప్పం నియోజకవర్గంలో మహిళను చెట్టుకు కట్టేసిన టీడీపీ కార్యకర్త ఘటనను మాజీ మంత్రి ఆర్ కే రోజా తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆమె ఓ వీడియో రిలీజ్ చేశారు.

**మాజీ మంత్రి ఆర్కే రోజా ఏమన్నారంటే..**

చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత ఇది ప్రజాస్వామ్యమా? రెడ్‌బుక్ రాజ్యమా అనే అనుమానం కలిగే విధంగా రాష్ట్రంలో ప్రతి రోజు మహిళలు, బాలికలపై దాడులు చేయడం, అత్యాచారాలు చేయడం, హత్యలు చేయడం, చెట్టుకు కట్టేసి కొట్టడం..ఇది ఏ రాష్ట్రంలోనైనా జరుగుతున్నాయా? ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే జరుగుతుందంటే ఇక్కడ చంద్రబాబు గానీ, పవన్ కళ్యాణ్ గానీ, హోం మంత్రి అనితా మహిళల పట్ల ఎలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో, మహిళల రక్షణను ఎలా గాలికి వదిలేశారో అందరికీ అర్థమవుతోంది.

**అమ్మాయిని కట్టేసి కొట్టడం నిజం కాదా?**

అధికారంలోకి వచ్చినప్పుడు ఏం చెప్పారండి..చంద్రబాబు అంటారు..ఎవరైనా ఆడపిల్లల జోలికి వస్తే అదే వాళ్లకు చివరి రోజు అవుతుందని అన్నారు. మరి మీ సొంత నియోజకవర్గంలో భర్త అప్పు చేశాడని భార్యను చెట్టుకు కట్టేసి కొడుతుంటే మీరు ఏం చర్యలు చేపట్టారు. వీళ్లకు ఎక్కడి నుంచి ధైర్యం వచ్చిందని నేను అడుగుతున్నాను. మీ పార్టీకి సంబంధించిన టీడీపీ నాయకుడు ఒకడు ఈ అమ్మాయిని కట్టేసి కొట్టడం నిజం కాదా? అతనికి ఎక్కడి నుంచి ధైర్యం వచ్చింది. కొడుకు ముందు అమ్మను కట్టేసి కొట్టారంటే ఈ రోజు పోలీసులను చూసినా భయం లేదు. చంద్రబాబును, హోం మంత్రిని చూసినా మీ పార్టీ వాళ్లకు భయం లేకుండా పోయింది. ఎందుకంటే లోకేష్ చెప్పినట్లు ఎవరు ఎక్కువగా హింస చేస్తే, ఎవరు ఎక్కువ దాడులు చేస్తే మీ గుడ్‌లుక్స్‌లో ఉండొచ్చు అన్నట్లుగా రాష్ట్రవ్యాప్తంగా అరాచకం సృష్టిస్తున్నారు.

**సిగ్గుచేటు**

రాష్ట్రంలో మహిళా హోంమంత్రి ఉండి కూడా మహిళలపై జరిగే దాడులను అరికట్టలేకపోతున్నారంటే అనిత నిర్లక్ష్యానికి నిదర్శనం కాదా? పరిటాల సునీత నియోజకవర్గం రాప్తాడులో చిన్న అమ్మాయిని 14 మంది కలిసి రేప్ చేస్తే కనీసం ఆవిడ వెళ్లి పలకరించలేదు.అనంతపురంలో ఒక గిరిజన ఇంటర్ మీడియట్ స్టూడెంట్‌ను చంపేశాడు. పోలీసుల నిర్లక్ష్యం వల్ల ఆ అమ్మాయి చనిపోతే అక్కడికి వెళ్లి హోంమంత్రి ఏమైనా చర్యలు చేపట్టారా?. ఎన్నికల తరువాత మాత్రం ఆవిడ గొప్పగా చెప్పింది. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాడు కాబట్టి ఆంధ్రప్రదేశ్‌లో మహిళలంతా గుండెలపై చేతులు పెట్టుకొని ప్రశాంతంగా నిద్రపోవచ్చు అని భారీ డైలాగ్ కొట్టింది. కనీసం కుప్పంలో కూడా మహిళలు ప్రశాంతంగా పండుకునే పరిస్థితి లేదు. ఈ రోజు హోం మంత్రి సెల్‌ఫోన్‌లో వీడియో కాల్ చేసి బాధిత మహిళను పరామర్శిస్తుందంటే ఆవిడ అహంకారానికి నిదర్శనం కాదా?. మహిళలకు, ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత హోంమంత్రికి ఉంటుంది. ఇంతకంటే ఏదో పని ఉన్నట్లు బిజీబిజీగా ఉంటున్నట్లు బాధిత కుటుంబాన్ని పరామర్శించడం లేదు.

## డిపి ఆర్ఓ గా బాధ్యతలు స్వీకరించిన కె బి ఎం సింగ్





**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,జూన్ 17:** జిల్లా పౌర సంబంధాల అధికారిగా కె. బాలామాన్ సింగ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డిపి ఆర్ ఓ విధులు నిర్వహిస్తున్న పి. గోవిందరాజులును సాదారణ బదిలీలలో భాగంగా శ్రీకాకుళం డిపి ఆర్ ఓగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఈమేరకు ఆయన మంగళవారం విధుల నుండి రిలీవ్ అయ్యారు. గోవిందరాజులకు సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా బదిలీపై వెళుతున్న డిపి ఆర్ ఓ గోవిందరాజులు మాట్లాడుతూ గత మూడేళ్ల నుండి ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలలో సహకారం అందించిన అధికారులకు, పాత్రికేయులకు ధన్యావాదాలు తెలియ జేసారు. అల్లూరి సీతారామ రాజు జిల్లాలో సేవలందించడం సంతృప్తికరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పౌర సంబంధాల అధికారి పి.రాములు, సీనియర్ సహాయకులు పి.శ్రీనివాసరావు, జూనియర్ సహాయకులు కె.సంధ్యారాణి, వరలక్ష్మి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## గుడ్ న్యూస్.. తగ్గుతున్న కరోనా వైరస్ కేసులు




**హైదరాబాద్ పెన్ పవర్:** కరోనా వైరస్ వ్యాప్తి క్రమంగా తగ్గుముఖం పడుతుంది. గత కొద్ది రోజులుగా అధికంగా కేసులు నమోదవుతుండటంతో ఆందోళన వ్యక్తమవుతుంది. మే 25వ తేదీ నుంచి కరోనా వైరస్ కేసుల సంఖ్య పెరుగుతున్నాయి. వందల సంఖ్య నుంచి ఏడు వేల వరకూ చేరి ఆ తర్వాత కొంత శాంతించినట్లు కనపడుతుంది. క్రమంగా కేసుల సంఖ్య తగ్గుతుండటం నిజంగా గుడ్ న్యూస్ అని చెప్పాలి. అలాగే డిశ్చార్జ్ అయ్యే వారి సంఖ్య కూడా ఎక్కువగా ఉందని ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. వందకు మందికి పైగానే ఈ ఏడాది కరోనా వైరస్ కారణంగా మరణించడంతో భారత ప్రభుత్వం కూడా అప్రమత్తమయింది. ప్రజలతో పాటు ప్రభుత్వాలు కూడా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించింది.

**ఎక్కువగా వ్యాప్తి ఉంటుందని...**

అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను అలెర్ట్ చేసింది. కోవిడ్ ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. ఆక్సిజన్ సిలండర్లతో పాటు అవసరమైన మందులను కూడా రెడీ చేసి పెట్టుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ వేరియంట్ ప్రమాదకరం కాకపోయినప్పటికీ వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు మరణించే అవకాశముండటంతో ఈ రకమైన ఆదేశాలు జారీ చేసింది. ఇమ్యునిటీని పెంచుకునే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని కూడా భారత ప్రభుత్వం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. వైరస్ వ్యాప్తి ఈ ఏడాది ఎక్కువగా ఉంటుందని అంచనాలు కూడా వినిపించాయి. వర్షాకాలం ముందే రావడం, నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్రవేశించడంతో చల్లటి వాతావరణంలో వైరస్ విజృంభిస్తుందని వైద్య నిపుణులు కూడా అభిప్రాయపడ్డారు.

**తగ్గుతుండటంతో...**

అయితే కొద్దిరోజులుగా కరోనా వైరస్ కేసుల సంఖ్య తగ్గుతుందని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. గడిచిన ఇరవై నాలుగు గంటల్లో దేశ వ్యాప్తంగా 179 పాజిటివ్ కేసులు మాత్రమే నమోదయ్యాయి. అందులో అత్యధికంగా కర్ణాటకలో 105 కేసులున్నాయని వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. ఇక యాక్టివ్ కేసుల సంఖ్య 6,836కు కు చేరుకుంది. వీటిలో అత్యధికంగా కేరళలో 1,659, కర్ణాటకలో 696, పశ్చిమ బెంగాల్ లో 747, గుజరాత్ లో 1,249 యాక్టివ్ కేసులున్నాయని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. ఇప్పటి వరకూ కరోనా వైరస్ కారణంగా 109 మంది మరణించారు. కరోనా వైరస్ కేసులు తగ్గుముఖం పట్టినప్పటికీ ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించింది.

## టాలీవుడ్ ను షేక్ చేస్తున్న పెద్ది మూవీ.. డిజిటల్ రైట్స్ పై వార్తలు నిజమయితే?




**హైదరాబాద్ పెన్ పవర్:** గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న పెద్ది మూవీ కి సంబంధించి తాజా అప్ డేట్ వచ్చేసింది. దీనికి సంబంధించిన షూటింగ్ హైదరాబాద్ లో జరుగుతుంది. అయితే పాన్ ఇండియా స్థాయిలో ఈ మూవీ తెరకెక్కుతుండటంతో అందరి చూపూ పెద్ది మూవీ వైపు నిలిచాయి. రామచరణ్ నటనకు బుచ్చిబాబు దర్శకత్వంతో మరింతగా హైప్ క్రియేట్ అయింది. ఇప్పటికే ఈ మూవీకి సంబంధించిన పోస్టర్ వైరల్ గా మారింది. క్రికెట్ నేపథ్యంలో కొనసాగే ఈ సినిమాను గ్రామీణ ప్రాంతం కథతో ముడిపెట్టి స్క్రీన్ మీదకు తెస్తున్నారు.

**షూటంగ్ పూర్తి కాకముందే...**

ఈసినిమాలో జాన్వికపూర్, జగపతి బాబు, శివరాజ్ కుమార్, దివ్యేందు శర్మ నటిస్తుండటం కూడా మరింతగా అంచనాలు పెరిగాయి. పెద్ది సినిమా కు సంబంధించిన ఏ అప్ డేట్ వచ్చినా అది అభిమానులకు పండగే. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈసినిమా కేవలం ఫ్యాన్స్ కు మాత్రమే కాదు. నిర్మాతలకు కూడా కాసుల వర్షం కురిపించేలా ఉంది. పెద్ది మూవీకి సంబంధించి తాజాగా డిజిటల్ హక్కులపై ఒక వార్త వైరల్ అయింది. ఈ మూవీ షూటింగ్ పూర్తికాకముందే పెద్ది డిజిటల్ రైట్స్ ను నెట్ ఫ్లిక్స్ కొనుగోలు చేసిందంటున్నారు.

**నెట్ ఫ్లిక్స్ డిజిటల్ రైట్స్ ను...**

నెట్ ఫ్లిక్స్ 105 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసిందన్న వార్తలు టాలీవుడ్ ను షేక్ చేశాయి. అయితే దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ టాలీవుడ్ టాక్ మాత్రం నడుస్తుంది. ఇప్పటి వరకూ టాలీవుడ్ లో ఇప్పటి వరకూ కుదిరిన అగ్రిమెంట్లలో ఇదే అతి పెద్దది అని చెబుతున్నారు. ఇక డిజిటల్ రైట్స్ తోనే వంద కోట్లు దాటేస్తే ఈ మూవీ రామ్ చరణ్ బర్త్ డే వచ్చే ఏడాది మార్చి 27వ తేదీన విడదలయితే ఇంకెన్ని రికార్డులు సృష్టిస్తుందన్నది చూడాలంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ కనిపిస్తున్నాయి.

## వర్షాలు తప్పవు.. ఉష్ణోగ్రతలు తగ్గుతాయ్.. ఉక్కపోత ఉండదు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. నైరుతి రుతుపవనాల కదలికలు ఎక్కువగా ఉండటంతో ద్రోణి ప్రభావం కారణంగా వర్షాలు పడతాయని తెలిపింది. దీంతో ఉష్ణోగ్రతలు రెండు రాష్ట్రాల్లో గణనీయంగా తగ్గుతాయని చెప్పింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ లో ఉక్కపోత ఎక్కువగా ఉంటుందని, తెలంగాణలో మాత్రం చల్లటి వాతావరణం నెలకొంటుందని పేర్కొంది. బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశముందని, గంటకు ముప్పయి నుంచి నలభై కిలోమీటర్ల వేగంతో తెలంగాణలో ఈదురుగాలులు వీచే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొన్నిచోట్ల పిడుగులు పడే అవకాశముందని కూడా వాతావరణ కేంద్రం వెల్లడించింది.

**సాగుకు అనుకూలం...**

ఈరోజు ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కొన్ని జిల్లాల్లో పడే అవకాశముందని, తెలంగాణలో కొన్ని జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఈరోజు సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, హైదరాబాద్, రంగారెడ్డి, భువనగిరి, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. వర్షాలు పడతాయి కాబట్టి ఖరీఫ్ ప్రారంభం కావడంతో సాగు పనులు ప్రారంభమయ్యాయని, పడుతున్న వర్షాలు సాగుకు అనుకూలంగానే ఉంటాయని వ్యవసాయశాఖ తెలిపింది. రైతులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.

**ఏపీలోనూ మోస్తరు వర్షాలు...**

ఆంధ్రప్రదేశ్ లోనూ పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. రానున్న ఇరవై నాలుగు గంటల్లో పలు జిల్లాలో భారీ వర్షంతో పాటు మోస్తరు వర్షాలు నమోదవుతాయని పేర్కొంది. చిత్తూరు, సత్యసాయి, అనంతపురం, నంద్యాల, ఏలూరు, అల్లూరి సీతారామరాజు, మన్యం, పార్వతీపురంమన్యం జిల్లాల్లో తేలికపాటినుంచి మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. మిగిలిన జిల్లాల్లో అక్కడకక్కడ తేలికపాటి వర్షాలు పడతాయని పేర్కొంది. కోస్తా తీరంలో బలమైన ఈదురుగాలులు వీస్తున్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని కూడా వాతావరణ కేంద్రం హెచ్చరించింది. కొన్ని చోట్లు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశముందని పేర్కొంది.

## పవన్ జనసైనికులను ఏం చేయాలనుకుంటున్నారు?




**హైదరాబాద్ పెన్ పవర్:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ పాతికేళ్లు రాజకీయాలు చేయానికి ప్రజల్లోకి వచ్చారు. పార్టీ పెట్టారు. ఇప్పటికే పార్టీ పెట్టి పదేళ్లు దాటి పోయింది. తొలిసారి జనసేన అధికారంలోకి వచ్చి ఏడాది అవుతుంది. అయితే దాదాపు పదేళ్ల నుంచి పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడంతో పార్టీ కార్యకర్తలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. నిజంగా ఒక రాజకీయ పార్టీకి కార్యకర్తలతో పాటు పార్టీ నిర్మాణం ముఖ్యం. కార్యకర్తలు నేరుగా అగ్రనేతలను కలిసే అవకాశముండదు. అందుకే గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకుంటే ఆ నేతలను సంప్రదించి తమ పనులను చక్కపెట్టుకోవడానికి ఏ పార్టీ కార్యకర్తకయినా వీలుంటుంది.

**నిర్మాణం లేని పార్టీగా...**

ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ, వైసీపీ, బీజేపీలకు పార్టీ నిర్మాణం పటిష్టంగా ఉంది. బీజేపీ ఓటు బ్యాంకు తక్కువే అయినప్పటికీ ఆ పార్టీకి గ్రామ స్థాయి నుంచి నేతలున్నారు. వారికి ఒక గుర్తింపు ఉంటుంది. ఇక టీడీపీ, వైసీపీ సంగతి చెప్పాల్సిన పనిలేదు. ఎందుకంటే రెండు పార్టీలు క్షేత్రస్థాయిలో బలమైన పార్టీలు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నుంచి బలం, బలగం ఉన్న పార్టీలవి. జనసేనకు బలగం రాష్ట్రంలో ఉన్నప్పటికీ దానిని లీడ్ చేసే వారు మాత్రం లేరు. ఎందుంకటే ఒక గ్రామంలో జనసేన పార్టీ కార్యకర్తకు కష్టం వచ్చినా, సమస్య చెప్పుకోవాలనుకున్నా ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి. పవన్ కల్యాణ్ పార్టీ పెట్టి పదేళ్లవుతున్నా నిర్మాణంపై దృష్టి పెట్టలేదు.

**ఆ భయంతో పదవులను...**

పదవులను అప్పగిస్తే వాటిని దుర్వినియోగం చేస్తారన్న భయంతో నిర్మాణం చేపట్టలేదన్నవాదనలో కొంత నిజమున్నా పార్టీ మరింత బలోపేతం కావాలంటే ఖచ్చితంగా నిర్మాణం అవసరం. ఒక మాజీ ఎమ్మెల్యే జనసేన పార్టీలో చేరాలనుకున్నా ఎవరిని సంప్రదించాలన్నది ఎవరికీ అర్థం కాకుండా ఉంది. పవన్ కల్యాణ్ అందరికీ అందుబాటులో ఉండరు. అదే సమయంలో తర్వాత స్థానంలో ఉన్న నేతలతో సంప్రదించాలన్నా అది సాధ్యపడటం లేదు. ఎవరి పనుల్లో వారు బిజీగా ఉంటున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చి తమ గోడు చెప్పుకున్నా కొందరికి మాత్రమే పవన్ తర్వాత నేతల దర్శనమవుతుంది. అందరికీ సాధ్యపడటం లేదు. దీంతో జనసైనికుల్లో నీరసం ఆవహించింది.

**2024 ఎన్నికలకు ముందున్న...**

మరోవైపు 2024 ఎన్నికలకు ముందున్న ఉత్సాహం కూడా జనసైనికుల్లో కనిపించడం లేదు. పవన్ కల్యాణ్ బయటకు వచ్చినప్పటికీ ఆయన సినీ అభిమానులు మినహా నిజమైన జనసైనికులు పెద్దగా రావడం లేదన్న వార్తలతోనైనా పవన్ కల్యాణ్ స్పందించాలంటున్నారు. కనీసం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నప్పటికీ తమకు కావాల్సిన పనులను చేయించుకోవడానికి ఎవరిని సంప్రదించాలో తెలియని అయోమయంలో జనసైనికులు ఉన్నారంటే వారి పరిస్థితులను వేరే చేప్పాల్సిన పనిలేదు. అందుకే జనసైనికుల్లో ప్రస్తుతం అసంతృప్తి బాగా పేరుకుపోయిందని అనేక సర్వేల్లో వెల్లడవుతుంది. తాము పడిన కష్టాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదన్న నిరాశ ఎక్కువగా గ్రౌండ్ లెవెల్ లో కనిపిస్తుంది. పవన్ ఇప్పటికైనా మేలుకోకపోతే.. తర్వాత రాజకీయంగా ఇబ్బందులు తప్పవంటున్నారు.

## కొత్త నినాదం అందుకుంటేనే.. లేకుంటే హిస్టరీ రిపీట్ అవుతుందట భయ్యా




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో ఒక ఎన్నికలకు పనిచేసిన నినాదం మరొక ఎన్నికల్లో పనిచేయదు. 2014 నుంచి ఇప్పటి వరకూ మూడు ఎన్నికలు జరిగాయి. ఈ మూడు ఎన్నికల్లోనూ ఒకసారి పనిచేసిన స్లోగన్ మరొకసారి పనిచేయలేదు. అందుకే నినాదాలతో పాటు రాజకీయ పార్టీలు కూడా స్ట్రాటజీలను మార్చుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఇప్పటి వరకూ జరిగిన మూడు ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. అదే సమయంలో మూడు ఎన్నికల్లో మార్పును ప్రజలు కోరుకోవడం కనిపించింది. అవే పార్టీలు అయినప్పటికీ ఒకసారి గెలిచిన వారు మరుసటి ఎన్నికల్లో గెలవలేకపోవడం విశేషం. అదే సమయంలో అవినీతి, సంక్షేమ పథకాలను కూడా ప్రజలు పెద్దగా పట్టించకోకపోవడమూ ఏపీ ఎన్నికల ప్రత్యేకం.

**లక్ష కోట్ల అవినీతి అంటూ...**

2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ కలసి పొత్తుతో పోటీ చేశాయి. నాడు జనసేన బయట నుంచి కూటమికి మద్దతు తెలిపింది. రాష్ట్ర విభజన జరగడం, చంద్రబాబుపై అపార నమ్మకంతో పాటు జగన్ పై అవినీతి ఆరోపణలు కూడా పనిచేశాయి. మూడు పార్టీలు కలవడం వల్ల కొంత ఇంపాక్ట్ ఎన్నికల ఫలితాలపై కనిపించింది. అయినా నాడు వైసీపీ ప్రతిపక్షంలోకి వచ్చినప్పటికీ అరవై సీట్లకు పైగానే వచ్చి బలమైన పక్షంగా నిలబడింది. ప్రజలు జగన్ పై చేసిన అవినీతి ఆరోపణలను నాడు నమ్మారో లేదో తెలియదు కానీ, మొత్తం మీద 2014లో విభజిత ఆంధ్రప్రదేశ్ కు తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేశారు. నాడు కాంగ్రెస్ కు ఒక్కస్థానం కూడా దక్కలేదు.

**నాడు పోలవరం, అమరావతి...**

2019 ఎన్నికల్లోనూ చంద్రబాబు అమరావతి, పోలవరం నినాదం అందుకున్నారు. జగన్ పై లక్షకోట్ల అవినీతి అంటూ నాడు నినాదాలు అందుకున్నారు. జగన్ తనకు ఒకే ఒక్క ఛాన్స్ ఇవ్వాలని జనాలను కోరారు. అమరావతి రాజధాని పోలవరం నిర్మాణం నినాదాలు చంద్రబాబుకు 2019 ఎన్నికల్లో పనిచేయలేదు. సంక్షేమం, అభివృద్ధి అన్నది కూడా పెద్దగా పట్టించుకోలేదు. జగన్ పాదయాత్ర కారణమో, ఒక్కసారి ఛాన్స్ ఇవ్వాలన్న నినాదమో తెలియదు కానీ వైసీపీకి భారీ మెజారిటీని కట్టబెట్టారు. 151స్థానాలతో వైసీపీ అధికారంలోకి రాగా, 23 స్థానాలకే టీడీపీ పరిమితమయింది. అయితే అప్పుడు టీడీపీ ఒక్కటే పోటీ చేసింది. బీజేపీ, జనసేనలు విడివిడిగా పోటీ చేశాయి.

**బాబాయ్ హత్య.. సంక్షేమ నినాదాలు...**

2024 ఎన్నికల్లో జగన్ సంక్షేమ పథకాల నినాదంతోనే ఎన్నికలకు వెళ్లారు. దాదాపు 2.40 లక్షల కోట్లు బటన్ నొక్కానని, లక్షల మంది ఖాతాల్లో నగదును వివిధ పథకాల రూపంలో అందచేశామని జగన్ ఎన్నికలకు వెళ్లారు. అయితే 2024లో 2014 కూటమి రిపీట్ అయింది. ఈసారి బీజేపీ, టీడీపీలతో కలసి జనసేన పోటీ చేసింది. జగన్ కుమించి సంక్షేమ పథకాలను అమలు చేస్తామని చంద్రబాబు ప్రజలకు హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ అంటూ, బాబాయ్ హత్య అంటూ ప్రజల ముందుకు వెళ్లడంతో టీడీపీ చరిత్రలోనే ఎన్నడూ రాని స్థానాలు వచ్చాయి. జగన్ పార్టీకి కేవలం 11 సీట్లు మాత్రమే పరిమితమయ్యాయి. అయితే ఈసారి ఈ నినాదాలేవీ కనిపించే అవకాశాలు మళ్లీ లేవు. కొత్త నినాదాలతో వెళ్లాల్సిన అవసరం ఇటు కూటమికి, అటు వైసీపీకి ఉందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

## స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గరపడుతున్నట్లే ఉందిగా.. అందుకేనా ఈ వరాలు




**హైదరాబాద్ పెన్ పవర్:** స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లే కనిపిస్తుంది. మంత్రులు ఇప్పటికే దీనిపై ప్రకటించినా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు చూస్తుంటే త్వరలోనే స్థానికసంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ సర్కార్ సిద్ధమవుతున్నట్లు కనిపిస్తుంది. తెలంగాణలో తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరిపేందుకు, తర్వాత మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఎన్నికలను నిర్వహించే దిశగా అడుగులు వేస్తునట్లు కనిపిస్తోంది. వరసగా తీసుకంటున్న నిర్ణయాలు స్థానిక ఎన్నికల్లో విజయం కోసమేనని చెప్పాలి. స్థానిక సంస్థల ఎన్నికలలో పూర్తిగా పై చేయి సాధించే యత్నంలో భాగంగానే ఆర్థికంగా ఇబ్బందులున్నా వరస నిర్ణయాలతో అన్ని వర్గాలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారని చెప్పాలి.

**ఉద్యోగుల కోసమే...**

ఇటీవల మంత్రివర్గ సమాశంలో ప్రభుత్వ ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న డీఏ ను మంజూరు చేసింది. తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఉపాధ్యాయ, ఉద్యోగ, పింఛనర్లకు డీఏ పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. డీఏను 3.64 శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉతర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ 26.39 శాతం ఇస్తుండగా, తాజా పెంపుతో అది 30.03 శాతానికి చేరింది.డీఏను జూన్ నెల వేతనంతో కలిపి జులై నెలలో చెల్లిస్తారు.. 2023 జనవరి ఒకటో తేదీ నుంచి 2025 మే 31వ తేదీ వరకూ ఇవ్వాల్సిన డీఏ బకాయిలను చెల్లించనున్నారు. సీపీఎస్ ఉద్యోగులకు పది శాతం డీఏ బకాయిలను ప్రాన్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

**తొమ్మిది వేల కోట్లను..**

తాజాగా రైతు భరోసా నిధులను విడుదల చేసింది. రైతురుణమాఫీ, రైతు భరోసా, వ్యవసాయ ఉచిత విద్యుత్తు, బీమా వంటి 1,01,728 కోట్లు రైతుల కోసం ఈ పద్దెనిమిది నెలల్లో ఖర్చు చేసింది. రైతుల కోసమే రైతు భరోసా నిధులను విడుదల చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కోటి 49 ఎకరాలకు రైతు భరోసా నిధులను మంజూరు చేశారు. తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్ల రూపాయలు ఇస్తున్నామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. దాదాపు ఏడు లక్షల మంది రైతులు లబ్ది పొందుతారని రేవంత్ రెడ్డి అన్నారు.దీంతో రైతులను కూడా తమ వైపు నకు తిప్పుకునేందుకు ఈ రకమైన నిర్ణయాలుతీసుకున్నట్లు కనపడుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యేలోపు మరికొన్ని వర్గాలను ఆకట్టుకునే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేయనుంది.

# ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్.. నెంబర్.1 స్థానంలో స్మృతి మంధాన



హైదరాబాద్ పెన్ పవర్: ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్ లో టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అగ్రస్థానానికి దూసుకెళ్లింది. మంగళవారం (జూన్ 17) ఐసీసీ ప్రకటించిన ర్యాంకింగ్స్ లో 727 రేటింగ్ పాయింట్లతో టాప్ కు చేరుకుంది. సౌతాఫ్రికా మహిళా క్రికెటర్ లారా వోల్వార్ట్‌ను వెనక్కి నెట్టిన మంధాన ఆరేళ్ళ తర్వాత తిరిగి వన్డేల్లో నెంబర్ వన్ స్థానానికి చేరుకోవడం విశేషం. చివరిసారిగా స్మృతి 2019లో నెంబర్ ర్యాంక్ లో నిలిచింది. సౌతాఫ్రికా కెప్టెన్ వోల్వార్ట్ 19 రేటింగ్ పాయింట్లు కోల్పోవడంతో స్మృతి టాప్ ర్యాంక్ కు చేరుకుంది.

లారా వోల్వార్ట్ (719), ఇంగ్లాండ్ కెప్టెన్ నటాలీ స్కైవర్-బ్రంట్ (719) సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు. అయితే కౌంట్‌బ్యాక్‌లో వోల్వార్ట్ మూడో స్థానానికి పడిపోయింది. ఇంగ్లాండ్ వికెట్ కీపర్ అమీ జోన్స్, ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ అమీ జోన్స్ వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. టాప్ 10 లో నాలుగు ఆస్ట్రేలియా క్రికెటర్లు ఉండడం విశేషం. స్మృతి మందాన ఇటీవలే ముగిసిన ట్రై-నేషన్ టోర్నమెంట్‌లో అదరగొట్టింది. మొత్తం 5 మ్యాచ్ ల్లో 52.80 యావరేజ్ తో 264 పరుగులు చేసింది. ఆమె స్ట్రైక్ రేట్ 90.41 గా ఉంది.

అదే సమయంలో ఇటీవలే వెస్టిండీస్‌తో ముగిసిన సిరీస్‌లో వోల్వార్డ్ రాణించలేకపోయింది. ఈ సఫారీ కెప్టెన్ రెండు మ్యాచ్ ల్లో వరుసగా 27, 28 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఇతర భారత బ్యాటర్లలో జెమిమా రోడ్రిగ్స్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ వరుసగా 14 మరియు 15వ స్థానాల్లో ఉన్నారు. బౌలర్ల విభాగంలో ఇంగ్లాండ్‌కు చెందిన సోఫీ ఎక్లెస్టోన్ 747 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. భారత బౌలర్లలో దీప్తి శర్మ నాలుగో స్థానానికి చేరుకుంది.

# : రెండు దశాబ్దాల ప్రయాణం: వన్డేలకు న్యూజిలాండ్ మహిళా దిగ్గజ ఆల్ రౌండర్ రిటైర్మెంట్



హైదరాబాద్ పెన్ పవర్: న్యూజిలాండ్ మహిళా దిగ్గజ క్రికెటర్ ఆల్ రౌండర్ సోఫీ డివైన్ వన్డే క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించింది. దాదాపు రెండు దశాబ్దాలపాటు బ్లాక్ క్యాప్స్ కు ప్రాతినిధ్యం వహించిన డివైన్.. తన 19 సంవత్సరాల క్రికెట్ కెరీర్ కు గుడ్ బై చెప్పింది. ఈ ఏడాది భరత్ వేదికగా జరగబోయే ఐసీసీ ఉమెన్స్ వరల్డ్ కప్ తర్వాత న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డివైన్ వన్డే ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటిస్తారని న్యూజిలాండ్ క్రికెట్ మంగళవారం (జూన్ 17) ధృవీకరించింది. 35 ఏళ్ల ఈ ఆల్ రౌండర్ టీ20 ఫార్మాట్ లో కొనసాగనుంది. రిటైర్మెంట్ తర్వాత డివైన్ మాట్లాడుతూ ఇలా చెప్పింది. "నేను వన్డేల నుంచి తప్పుకోవడానికి ఇది సరైన సమయం అని భావిస్తున్నాను. నా రిటైర్మెంట్ కు మద్దతు తెలిపిన న్యూజిలాండ్ క్రికెట్ బోర్డుకు నా కృతజ్ఞతలు. ప్రస్తుతం న్యూజిలాండ్ యువ జట్టు అద్భుతంగా ఉంది". అని డివైన్ తెలిపింది. సెప్టెంబర్ 30 నుండి నవంబర్ 2 వరకు మహిళల వన్డే వరల్డ్ కప్ జరుగుతుంది. ఇండియా, శ్రీలంక వన్డే వరల్డ్ కప్ కు సంయుక్తంగా ఆతిధ్యమివ్వనున్న ఈ మెగా టోర్నీలో డివైన్ కివీస్ కు కెప్టెన్ గా వ్యవహరించనుంది. 2006లో 17 ఏళ్ల వయసులో సోఫీ డివైన్ వన్డే క్రికెట్ ద్వారా అంతర్జాతీయ అరంగేట్రం చేసింది. దాదాపు రెండు దశాబ్దాలు ఆమె కివీస్ మహిళా క్రికెట్ విజయాల్లో కీలక పాత్ర పోషించింది. 152 వన్డేల్లో 31.66 సగటుతో 3990 పరుగులు చేసింది. మరో 10 పరుగులు చేస్తే ఆమె 4000 పరుగుల క్లబ్ లోకి చేరుతుంది. న్యూజిలాండ్ ఆల్-టైమ్ వన్డే రన్-స్కోరర్ జాబితాలో ఆమె నాల్గవ స్థానంలో నిలిచింది. వన్డే వరల్డ్ కప్ లో అక్టోబర్ 1న ఇండోర్‌లో ఏడుసార్లు ఛాంపియన్స్ ఆస్ట్రేలియాతో న్యూజిలాండ్ తమ తొలి మ్యాచ్ ఆడనుంది.

# సూపర్ కింగ్స్ తడాఖా: చేసింది 153 పరుగులే.. 90 పరుగులతో విజయం



హైదరాబాద్ పెన్ పవర్: మేజర్ లీగ్ క్రికెట్ 2025లో టెక్సాస్ సూపర్ కింగ్స్ జోరు కొనసాగుతుంది. వరుస విజయాలతో టోర్నీలో ఓటమి లేని జట్టుగా దూసుకెళ్తుంది. ఈ టోర్నమెంట్ తొలి రెండు మ్యాచ్ ల్లో బ్యాటింగ్ లో అదరగొట్టిన సూపర్ కింగ్స్.. మంగళవారం సియాటిల్ ఓర్కాస్ పై (జూన్ 17) బౌలింగ్ లో దుమ్మురేపింది. మొదట బ్యాటింగ్ చేసి 153 పరుగులే చేసినప్పటికీ ప్రత్యర్థి జట్టును కేవలం 60 పరుగులకే ఆలౌట్ చేసింది. దీంతో ఏకంగా 93 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ టోర్నీలో సూపర్ కింగ్స్ జట్టుకు ఇది వరుసగా మూడో విజయం కాగా.. మరోవైపు సియాటిల్ ఓర్కాస్ కు వరుసగా రెండో ఓటమి. మ్యాచ్ పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మొదట బ్యాటింగ్ చేసిన టెక్సాస్ సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 153 పరుగుల స్కోర్ మాత్రమే చేయగలిగింది. ఓర్కాస్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో సూపర్ కింగ్స్ పరుగుల కోసం తీవ్రంగా ఇబ్బంది పడింది. సాయితేజ ముక్కమల్ల 30 పరుగులు చేసి టాప్ స్కోరర గా నిలిచాడు. డారిల్ మిచెల్ 25 పరుగులతో రాణించగా.. చివర్లో మార్కస్ స్టోయినిస్ కేవలం 12 బంతుల్లోనే నాలుగు సిక్సర్లతో 28 పరుగులతో జట్టు స్కోర్ ను 150 పరుగులకు చేర్చాడు. ఒక మాదిరి లక్ష్య ఛేదనలో సియాటిల్ ఓర్కాస్ కేవలం 60 పరుగులకే కుప్పకూలింది. సూపర్ కింగ్స్ బౌలర్లు బర్గర్, జియా-ఉల్-హక్, నూర్ అహ్మద్ విజృంభించడంతో ఏ దశలోనూ ఓర్కాస్ ఇన్నింగ్స్ గెలుపు దిశగా సాగలేదు. ఒక దశలో ఓర్కాస్ 27 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో టోర్నీ చరిత్రలో అత్యల్ప స్కోర్ నమోదు చేస్తుందనే అనుమానాలు కలిగాయి. అయితే చివరి ఆరోన్ జోన్స్ (17), జస్ప్రిత్ సింగ్ (12) రెండంకెల స్కోర్ చేసి జట్టును చెత్త రికార్డ్ నుంచి కాపాడారు. జియా-ఉల్-హక్ కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

# బెడ్‌పై జాన్వీ మతి చెడే భంగిమలు

యాషికా ఆనంద్ డ్రామా హింట్‌తో అద్భుతమైన లుక్‌ను పంచుకున్నారు





క్రిస్టల్ డిసౌజా యొక్క గ్లామరస్ లుక్ అభిమానులను మంత్రముగ్ధులను చేస్తుంది



నేటి జెన్ జెడ్ కిడ్స్ లో జాన్వీ కపూర్ స్టైల్ వేరు. ఈ భామ తన కోస్టార్స్ కంటే అన్నిటిలో అడ్వాన్స్ డ్ గా ఉంటుంది. ఎప్పటికప్పుడు స్టన్నింగ్ ఫ్యాషన్ సెన్స్, మేకోవర్ తో కట్టి పడేస్తుంది. స్టైల్ ఐకాన్ అన్న పదానికి నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తుంది. ఇప్పుడు ఈ జెన్ జెడ్ బ్యూటీ మరోసారి తనదైన స్టైల్ ఎలివేషన్ తో మతులు చెడగొడుతోంది.జాన్వీ టాప్ లెస్ దుస్తుల్లో కనిపించి టాప్ లేపేసింది. ఈ కపూర్ బ్యూటీ తనలోని ఇన్నర్ సొగసును ఆవిష్కరించే లోదుస్తులను ధరించింది. అయితే ఈ లోదుస్తులను కవరప్ చేస్తూ, బ్లాక్ కలర్ కోట్ ని కూడా జాన్వీ కపూర్ ధరించింది. ఒక ఫోటోలో జాన్వీ ఊలు జాకెట్ ని కూడా ధరించి కనిపించింది. ముఖ్యంగా బెడ్ పై రకరకాల భంగిమల్లో ఫోజులిచ్చిన జాన్వీ.. రకరకాల డిజైనర్ లుక్స్ లో కనిపించి హృదయాలను కొల్లగొట్టింది.ఈ ఫోజులు చూడగానే యూత్ జాన్వీ భంగిమలకు మైండ్ బ్లాంక్ అయ్యిందని కామెంట్ చేస్తున్నారు. ఓ నెటిజన్ బెడ్ పై జాన్వీ భంగిమలు చూడగానే మతి చెడింది! అంటూ ట్వీట్ చేసాడు. ప్రస్తుతం ఈ యూనిక్ ఫోటోషూట్ యువతరం వాట్సాపులు, సోషల్ మీడియాల్లో వైరల్ గా మారుతోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. జాన్వీ కపూర్ ఇటీవలే ఎన్టీఆర్ సరసన దేవర చిత్రంలో నటించింది. వెంటనే మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ సరసన - పెద్ది-లో అవకాశం అందుకుంది. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా పూర్తవుతున్న సంగతి తెలిసిందే. ఓవైపు చరణ్ తో షూటింగ్ లో పాల్గొంటూనే, మరోవైపు వరుసగా మ్యాగజైన్ కవర్ ఫోటోషూట్లను జాన్వీ షేర్ చేస్తోంది.

In behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com